ANN తెలుగు
Follow: @ANNTELUGU
14-08-2026
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 221 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్

- **అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు**

స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన సీఎం చంద్రబాబు
రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయం పరిశీలన

**అమరావతి, మహా :** సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాభివృద్ధిలో, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని సీఎం స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని విజయవాడ మంగళగిరి గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ3ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా సీఎం ప్రారంభించారు. వీటి ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్‌లతో మిగతా 2వ పేజీలో

**టాప్ న్యూస్**

### ఖర్గే సభ జరిగిన చోట శుద్ధీకరణ హోమం



- రాజ్యసభలో ఖర్గే తీవ్ర అభ్యంతరం
- ఘటన దురదృష్టకరమని జేపీ నడ్డా వ్యాఖ్య

03

### నేను మాజీ సీఎంను.. కనీస మర్యాద లేదా?



- జైలులో అవమానిస్తారా?
- వైఎస్ జగన్ ఆగ్రహం
- కర్నూలు పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత.

03

### అమెరికాలో 'ఇండియా డే' వేడుకలు



02

## పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు చేతబడులు చేయిస్తారా?



- రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారు
- పక్క రాష్ట్రాల్లో అఘోరా పూజలు చేశారు
- సీఎం రేవంత్ సంచలన కామెంట్స్
- అయినా దేవుడు మా వైపే ఉన్నడు

**నిషేధిత జాబితాలోని (22ఏ) భూములకు నాదీ పూచీ**



**హైదరాబాద్, మహా :** పదేళ్ల బీఆర్ఎస్ .. రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. ''చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. ఎంత ఘోరంగా అఘోరా పూజలు చేసినా దేవుడు మన వైపు ఉన్నడు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు మిగతా 2వ పేజీలో

### తెలంగాణలో 73లక్షల ఓట్ల తొలగింపు కుట్ర

- దేశంలో ఎక్కడాలేని విధంగా కుట్ర జరుగుతోంది
- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై.. కాంగ్రెస్ ఓట్లు తొలగిస్తున్నాయ్
- బెంగాల్ తర్వాత తెలంగాణలోనే అత్యధిక తొలగింపులు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైర్
- ఇన్ ఛార్జి మంత్రులదే బాధ్యత

02

### సిమెంటు, ఇటుకలు, ఏఐ భారత రియల్ ఎస్టేట్ రంగంలో జోరుగా ఏఐ వినియోగం

03



## సీఎం శాఖలోనే అరాచకమా...!



**ఖానామెట్ సర్వే నంబర్లు 11/33, 11/34 లలో ప్రభుత్వ భూమి దురాక్రమణ...!**

- అక్రమ నిర్మాణాలకు ప్రజా ప్రతినిధుల అండ...!
- సైట్ వైపు వెళ్తే కాళ్లు విరుగుతాయ్...!
- అధికార పార్టీ నాయకుడు హుకుం జారీ...!
- అధికారులకు ఓ ఎమ్మెల్యే అల్టిమేటం...!
- ఆవేదన వ్యక్తం చేసిన ఓ ఉన్నతాధికారి...!
- నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు ...!
- ఆగని బహుళ అంతస్థుల కమర్షియల్ అక్రమ నిర్మాణాలు...!
- అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ప్రశ్నిస్తే...
- మేము కాపలా కూర్చోవాలా అంటూ ఏసీపీ బుకాయింపు...!
- స్పెషల్ టాస్క్‌ఫోర్స్ నోడల్ అధికారి ఎక్కడ...!
- నోరు మెదపని కలెక్టర్, సీఎంసీ కమిషనర్...!
- సీఎం స్పందించాలని కోరుతున్న స్థానికులు...!

02

రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా నిర్వహించే మున్సిపల్ శాఖలోనే అరాచకం రాజ్యమేలుతోంది. ఖానామెట్ ప్రభుత్వ సర్వే నంబర్లు 11/33, 11/34 లలో సుమారు 4 వేల గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయాలు యథేచ్ఛగా కొనసాగిస్తూ రియల్ మాఫియా సీఎం శాఖకే సవాల్ విసురుతోంది. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన స్థానిక ప్రజాప్రతినిధులు రియల్టర్లతో కుమ్మక్కై అధికారులను బెదిరిస్తూ, నిర్మాణాల వైపు వెళ్తే కాళ్లు విరుగుతాయంటూ అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు హుకుం జారీ చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ఆక్రమించిన భూమి విలువ సుమారు వంద కోట్ల రూపాయలకు పైమాటే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. గుడినే కాకుండా గుడిలో లింగాన్నీ మింగినట్టుగా, ప్రభుత్వ భూమినే కాకుండా ప్రధాన రహదారిని సైతం ఆక్రమించి ఎలాంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా ఇక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టడం రియల్టర్ల బరితెగింపునకు నిలువెత్తు నిదర్శనం. ఓ ఎమ్మెల్యే సంబంధిత ఉన్నాతాధికారులకు నిర్మాణ పనులను అడ్డుకోవద్దంటూ అల్టిమేటం జారీ చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అక్రమ నిర్మాణాలను అడ్డుకోకుండా చోద్యం చూస్తున్నారని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి.నోటీసులు ఇచ్చినా నిర్మాణ పనులు ఎందుకు ఆగడం లేదని స్థానికులు సంబంధిత ఏసీపీని ప్రశ్నిస్తే , "మా ప్రాణాలను పణంగా పెట్టి కాపలా కాయాలా?" అంటూ బుకాయించినట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిఎంసీలో ఇంత అరాచకం జరుగుతుంటే అడ్డుకోవాల్సిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ నోడల్ అధికారి ఎక్కడ అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.




# సీఎం శాఖలోనే అరాచకమా...!



**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), శేరిలింగంపల్లి మండలం, కూకట్‌పల్లి జోన్, ఖానామేట్ సర్వే నంబర్లు 11/33, 11/34 లలో సుమారు 4 వేల చదరపు గజాల, రూ.100 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమిని రియల్ మాఫియా స్థానిక అధికార పార్టీ నేతల అండదండలతో ఆక్రమించి బహుళ అంతస్తుల కమర్షియల్ నిర్మాణాలను చేపట్టడం బహిరంగ విమర్శలకు తావిస్తుంది. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖ పరిధిలోనే ప్రభుత్వ భూముల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి ధర రూ.100 కోట్లకు పైమాటే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉన్న ఖానామేట్ ప్రాంతం ప్రస్తుతం నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఒకటిగా పరిగణించబడుతోంది. అలాంటి ప్రాంతంలో ప్రభుత్వ భూములు సైతం కబ్జాదారుల బారిన పడుతుండటం స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని వారు ఆక్షేపిస్తున్నారు .ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత వహించాల్సిన రెవెన్యూ అధికారులు, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సినటౌన్ ప్లానింగ్ యంత్రాంగం కళ్లముందే అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.నగరంలో అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఒకటిగా పేరొందిన ఖానామేట్‌లో ప్రభుత్వ భూములపైనే నిర్మాణాలు సాగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నప్పటికీ, వాటిని అడ్డుకోవాల్సిన యంత్రాంగం మాత్రం మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణ పౌరుడు చిన్న నిబంధన ఉల్లంఘన చేసినా నోటీసులు, జరిమానాలు, భారీ పోలీస్ బందోబస్తూ మధ్య కూల్చివేతలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. కానీ కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల విషయంలో మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.ఈ వ్యవహారంపై స్థానికులు, సామాజిక వేత్తలు పక్కా ఆధారాలతో సహా పలు అంశాలను వెలుగులోకి తీసుకువచ్చినప్పటికీ, సంబంధిత శాఖల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఫిర్యాదులు అందిన తర్వాత కూడా అక్రమ నిర్మాణాలు నిలిపివేయాల్సింది పోయి, మరింత వేగంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. చట్టం కంటే రాజకీయ అండదండలే మెండుగా మారాయా అనే చర్చ జోరుగా సాగుతోంది.ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం రెవెన్యూ శాఖ ఉంది... అక్రమ నిర్మాణాల నియంత్రణకు టౌన్ ప్లానింగ్ ఉంది... ఆక్రమణల నిరోధానికి ప్రత్యేక వ్యవస్థలు ఉన్నాయి... అయినప్పటికీ ఖానామేట్‌లో పరిస్థితి మాత్రం దానికి భిన్నంగా కొనసాగుతుండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నోటీసులు ఇచ్చామని అధికారులు చెబుతున్నా, నిర్మాణాలు ఎందుకు ఆగడం లేదన్న ప్రశ్నకు మాత్రం సమాధానం కనిపించడం లేదని, కాగితాలపైనే చర్యలు, క్షేత్రస్థాయిలో మాత్రం మౌనం అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అక్రమ నిర్మాణాలకు ప్రజా ప్రతినిధుల అండ...!**

ప్రభుత్వ భూములపై జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన ప్రజాప్రతినిధులే రియల్ మాఫియాకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు స్థానికంగా బహిరంగ చర్చ జరుగుతుంది. ప్రజల ఆస్తులను కాపాడతామని, చట్టాన్ని పరిరక్షిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాయకులే ఇప్పుడు అక్రమ నిర్మాణదారులకు కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల తరఫున నిలబడాల్సిన వారు భూ మాఫియా తరఫున నిలబడుతుండటంతో అధికార యంత్రాంగం సైతం చర్యలు తీసుకునేందుకు వెనుకంజ వేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు, ఆధారాలు, ప్రజల నిరసనలు ఉన్నప్పటికీ చర్యలు లేకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

**సైట్ వైపు వెళ్తే కాళ్లు విరుగుతాయ్...!**

అక్రమ నిర్మాణాలను పరిశీలించేందుకు వెళ్లే అధికారులను కొందరు అధికార పార్టీ నాయకులు బహిరంగంగానే బెదిరిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. "సైట్ వైపు వెళ్తే కాళ్లు విరుగుతాయి" అంటూ హెచ్చరికలు జారీ అవుతున్నాయని సంబంధిత అధికారులు వాపోతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు వెళ్లే అధికారులకే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతుంటే, సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులపై బెదిరింపులు రావడం రాష్ట్ర పరిపాలనా వ్యవస్థకు మచ్చగా నిలుస్తోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

**అధికార పార్టీ నాయకుడు హుకుం జారీ...!**

అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు నిర్మాణాల జోలికి వెళ్లవద్దంటూ సంబంధిత అధికారులకు హుకుం జారీ చేశాడనే ప్రచారం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. చట్టం కంటే రాజకీయ హుకుం పెద్దదిగా మారిందా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సుప్రీం కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ, ప్రభుత్వ నిబంధనలు, వివిధ శాఖల మార్గదర్శకాలు అన్నీ పక్కనపెట్టి కొందరు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికార యంత్రాంగంపై రాజకీయ పెత్తనం పెరిగిపోవడం వల్లే అక్రమ నిర్మాణాలు నిర్భయంగా కొనసాగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

**అధికారులకు ఓ ఎమ్మెల్యే అల్టిమేటం...!**

ప్రజల ప్రాణాలు, ప్రభుత్వ ఆస్తులను కాపాడతామని దేవుడిపై ప్రమాణం చేసి పదవులు చేపట్టిన ప్రజాప్రతినిధులు, ఆ ప్రమాణాలను గాలికొదిలేసి అక్రమ సంపాదనే ధ్యేయంగా బావిస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఓ ఎమ్మెల్యే సైతం అధికారులకు అల్టిమేటం జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన అధికారులపైనే ఒత్తిళ్లు తీసుకురావడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని స్థానికులు మండిపడుతున్నారు. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన అధికారులను రాజకీయంగా ప్రభావితం చేయడం వల్ల అక్రమాలకు మరింత ఊతం లభిస్తోందని విమర్శిస్తున్నారు .

**నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు...!**

అక్రమ నిర్మాణాలకు సంబంధించి టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆ తర్వాత చర్యలు తీసుకోలేదనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. నోటీసులు జారీ చేయడమే తమ బాధ్యత అన్నట్లుగా వ్యవహరించి, నిర్మాణాలను నిలిపివేయడంలో పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ కూల్చివేతలు, సీజ్ చర్యలు, నిరోధక చర్యలు చేపట్టకపోవడం వెనుక అసలు కారణం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.సంబంధిత నిర్మాణాలకు అవసరమైన అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూమితో పాటు ప్రధాన రహదారిని సైతం ఆక్రమించి యథేచ్ఛగా బహుళ అంతస్తుల కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నా వాటిని అడ్డుకుని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత మున్సిపల్ శాఖలదే" అని తహసీల్దార్ స్పష్టం చేసారు.

**అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ప్రశ్నిస్తే... మేము కాపలా కూర్చోవాలా అంటూ ఏసీపీ బుకాయింపు...!**

అక్రమ నిర్మాణాలను ఎందుకు అడ్డుకోవడం లేదని స్థానికులు సంబంధిత ఏసీపీని ప్రశ్నించగా, "మేము కాపలా కూర్చోవాలా?" అన్నట్లుగా స్పందించారని ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు స్థానికుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయి. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే ఇలాంటి సమాధానాలు చెబితే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలని ప్రశ్నిస్తున్నారు. బాధ్యతాయుత పదవిలో ఉన్న అధికారి నుంచి ఇలాంటి స్పందన రావడం పరిస్థితి తీవ్రతను ప్రతిబింబిస్తోందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు .

**స్పెషల్ టాస్క్‌ఫోర్స్ నోడల్ అధికారి ఎక్కడ...!**

ప్రభుత్వ భూముల పరిరక్షణ, భూదురాక్రమణల నివారణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఈ వ్యవహారంలో ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని ఆరోపణలు వస్తున్నప్పటికీ టాస్క్‌ఫోర్స్ స్పందించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని వారు పేర్కొంటున్నారు. స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం కు బాస్ గా వ్యవహరించే జోనల్ కమిషనర్ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి చిన్న చిన్న అంశాలపై వెంటనే స్పందించే యంత్రాంగం, ఇంత పెద్ద వ్యవహారంలో ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నిస్తున్నారు.

**సీఎం స్పందించాలని కోరుతున్న స్థానికులు...!**

ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలు, అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు, ప్రజాప్రతినిధుల జోక్యంపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఖానామెట్ సర్వే నంబర్లు 11/33, 11/34లలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దురాక్రమణలను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన వ్యవస్థలే మౌనం వహిస్తే ప్రజలు ఎవరిని నమ్మాలని ప్రశ్నిస్తున్నారు.రూ.100 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని ఆరోపణలు వస్తున్నా, సంబంధిత శాఖలు ఒకదానిపై మరొకటి నిందారోపణలు నెట్టుకుంటూ కాలయాపన చేస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రాజీపడబోమని ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్న నేపథ్యంలో, ఖానామెట్ వ్యవహారంలో మాత్రం ఆ హామీలు కాగితాలకే పరిమితమయ్యాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ ప్రజలు చిన్నపాటి నిబంధన ఉల్లంఘించినా వెంటనే చర్యలు తీసుకునే యంత్రాంగం, కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల విషయంలో ఎందుకు మౌనం వహిస్తోందని వారు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుని ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించాలని, సర్వే నంబర్లు 11/33, 11/34 లోని భూముల యాజమాన్యం, నిర్మాణ అనుమతులు, సంబంధిత శాఖల పాత్ర, ప్రజాప్రతినిధుల జోక్యంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని స్థానిక ప్రజలు ఏకాభిప్రాయంతో కోరుతున్నారు.

**ఆవేదన వ్యక్తం చేసిన ఓ ఉన్నతాధికారి...!**

ఈ వ్యవహారంపై స్పందించిన ఓ ఉన్నతాధికారి తన ఆవేదనను వ్యక్తం చేసారు. చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలనుకున్నప్పటికీ రాజకీయ జోక్యాలు, ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురవుతున్నాయని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రభుత్వ భూముల రక్షణ విషయంలో అధికారులకు పూర్తి స్వేచ్ఛ లేకపోవడం వల్లే ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని వారు అభిప్రాయపడుతున్నారు. వ్యవస్థలోని నిజాయితీగల అధికారుల చేతులు కట్టేస్తున్నారనే వ్యాఖ్యలు బలంగా వినిపిస్తున్నాయి.




**ఆగని బహుళ అంతస్థుల కమర్షియల్ అక్రమ నిర్మాణాలు...!**

నోటీసులు అందుకున్న తర్వాత కూడా నిర్మాణ పనులు ఏమాత్రం ఆగకుండా మరింత వేగంగా కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ భూములతో పాటు ప్రధాన రహదారి స్థలాన్ని సైతం ఆక్రమించి, ఎలాంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. రోజురోజుకూ అంతస్తులు పెరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. చట్టం అమలవుతున్నదా? లేక చట్టాన్ని ఎవరైనా కొనుగోలు చేశారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.







**నోరు మెదపని కలెక్టర్, సీఎంసీ కమిషనర్...!**

జిల్లా కలెక్టర్, సీఎంసీ కమిషనర్‌లకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ ఉన్నతాధికారులు స్పందించకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. వారి మౌనం అక్రమార్కులకు ధైర్యం ఇస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.







# అమెరికాలో 'ఇండియా డే' వేడుకలు

**పంద్రాగస్టుకు అధికారిక గుర్తింపు**



**మహా :** భారత స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికాలోని పలు రాష్ట్రాలు ఆగస్టు 15ను 'ఇండియా డే'గా గుర్తిస్తూ ప్రత్యేక ప్రకటనలు జారీ చేస్తున్నాయి. అమెరికాలో స్థిరపడిన భారత సంతతి ప్రజల సేవలు, విజయాలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు గుర్తింపుగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. తాజాగా డెలావేర్ రాష్ట్రం కూడా ఆగస్టు 15ను ఇండియా డేగా ప్రకటించింది. దీంతో భారత స్వాతంత్య్ర దినోత్సవానికి అధికారిక గుర్తింపు ఇచ్చిన అమెరికా రాష్ట్రాల జాబితాలో డెలావేర్ కూడా చేరింది.డెలావేర్ గవర్నర్ మ్యాథ్యూ మేయర్ సంతకం చేసిన ప్రకటనలో భారతీయ అమెరికన్ల సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. డెలావేర్‌లో అనేక సంస్కృతులు, సంప్రదాయాలను అనుసరించే ప్రజలు నివసిస్తున్నారని, వారి భాగస్వామ్యంతో రాష్ట్రం మరింత బలోపేతమవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని భారతీయ అమెరికన్ సమాజం క్రమంగా విస్తరిస్తోందని, ఆ వర్గానికి చెందిన ప్రజలు తమ పని, నాయకత్వం, సేవల ద్వారా డెలావేర్ అభివృద్ధికి పెద్ద ఎత్తున తోడ్పడుతున్నారని ప్రశంసించారు. భారతీయ సంతతికి చెందిన ప్రజలు రాష్ట్రంలోని వివిధ రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని డెలావేర్ గవర్నర్ తన ప్రకటనలో కొనియాడారు. వారి కృషి రాష్ట్ర ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడటంతోపాటు భవిష్యత్ తరాలకు కొత్త అవకాశాలను సృష్టిస్తోందని చెప్పారు. భారతదేశానికి చెందిన భాషలు, సంప్రదాయాలు, విశ్వాసాలు, సంస్కృతుల వైవిధ్యం ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. తరతరాలుగా భారతీయ అమెరికన్లు వాటిని అమెరికాలో కొనసాగిస్తూ తమకుంటూ ప్రత్యేక గుర్తింపును నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు.

# తెలంగాణలో 73లక్షల ఓట్ల తొలగింపు కుట్ర

**హైదరాబాద్, మహా :** ఎస్ఐఆర్ పేరుతో కుట్రలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బెంగాల్ తరువాత తెలంగాణే మా టార్గెట్ అని కొందరు అంటున్నారని, రాష్ట్రంలో 70 లక్షల ఓట్లు తొలగిస్తున్నారని వార్తలు వస్తున్నాయన్నారు. అర్హులైన వాళ్ల ఓట్లు పోకుండా చూడాలని ఓట్లు తొలగించిన వారి కుట్రలు ఫలించకూడదన్నారు. హైదరాబాద్ లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్ లో జరిగిన మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఉన్న ప్రతి ఒక్కరు ఒక్కో రేవంత్ రెడ్డిలా మారి రాబోయే పది రోజులు పని చేయాలన్నారు.గుజరాత్ నుంచి వస్తున్న వారిని అడ్డుకునేందుకు, ఈ రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు నడుము బిగించాలని పిలుపునిచ్చారు. ఓటర్ల పేర్లు రాయడంలో ఎలాంటి తప్పులు జరగవద్దని, చిన్న చిన్న తప్పులతో ఓట్లు పోయే పరిస్థితి రాకూడదన్నారు. బీఎల్ఓ పని ఎలా ఉన్నా మీరంతా బీఎల్ఏగా మారి అర్హులైన వాళ్ల ఓట్లు పోకుండా చూడాలన్నారు.

**టీపీసీసీ జూమ్ మీటింగ్ లోనూ... సీఎం సీరియస్**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా 21 శాతం ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉందని, ఇంచార్జ్ మంత్రుల నుంచి బూత్ లెవెల్ వరకు సరైన బాధ్యత తీసుకోకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత ఇంచార్జ్ మంత్రులు జిల్లాల్లో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జులతో సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉందని, రెండు రోజులు క్షేత్ర స్థాయికి వెళ్లి జిల్లాల్లో సమీక్ష నిర్వహించాలని ఆదేశిస్తున్నానన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రులు ప్రతీ నియోజకవర్గానికి సంబంధించి నివేదిక తయారు చేయాల్సిందేనని, అసెంబ్లీ ఇంచార్జులు 4 రోజులు నియోజకవర్గంలో ఉండి సమస్యలు తెల్సుకుని పూర్తి స్థాయిలో పరిష్కరించాల్సిందేనన్నారు. సరైన కార్యాచరణతో ముందుకు వెళ్లకపోతే పార్టీ ఉపేక్షించదన్నారు. ఇవి ఏఐసీసీ నుంచి వచ్చిన స్పష్టమైన ఆదేశాలని, పకడ్బందీ కార్యాచరణతో వెళ్లకపోతే భవిష్యత్ లో రాజకీయంగా పెద్ద నష్టం జరుగుతుందన్నారు. ఎస్ఐఆర్ లో సమస్యలను పరిష్కరించడంతో పాటు.. బీజేపీ, బీఆరెస్ కలిసి చేస్తున్న ఓట్ల తొలగింపు కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకుని ముందుకు వెళ్ళాలన్నారు.

# పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు చేతబడులు చేయిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)



చేతబడిపూజలు చేశారు. బుద్ధిసక్కగ లేకపోతే మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుకోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా?" అని రేవంత్‌రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు.

**పేదల సొంతింటి కలను నెరవేరుస్తా**

అంతకుముందు సీఎం మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు."మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం" అని రేవంత్ అన్నారు.

**భూమి 22-ఎలో పడితే నాదీ పూచీ**

ఈ సందర్భంగా 22ఎ భూముల అంశంపై ఆయన మాట్లాడారు. "మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తాను"అని సీఎం తెలిపారు. సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు పాల్గొన్నారు.

# రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాయపూడి నుంచి వెంకటపాలెం పెనుమాక మీదుగా ఉండవల్లి వరకూ సీడ్ యాక్సెస్ రహదారిని సీఆర్డీఏ నిర్మించింది. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్లైంది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక చేశారు. దీనికి రూ.1,519 కోట్ల వ్యయం కానుంది. స్టీల్ బ్రిడ్జిలతో పాటు సీడ్ యాక్సెస్ రహదారిని సీఎం కాలినడకన తిరిగి ఆసాంతం పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ... "రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్. తెలుగు జాతి గర్వపడేలా ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం జరిగింది. విభజన తర్వాత రాష్ట్రం నష్ట పోయింది. రాజధాని కూడా లేకుండా పోయింది. 25 పార్లమెంటు స్థానాల్లో మధ్యలో ఉన్న గుంటూరు జిల్లాలో రాజధాని పెట్టాలని ఆనాడు సంకల్పించాం. విస్తృత చర్చల తర్వాత మాపై విశ్వాసంతో రైతులుట్లు రాజధాని నిర్మాణం కోసం ముందుకు వచ్చి భూములు ఇచ్చారు. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ పాదాభివందనం చేస్తున్నాను. రైతులది త్యాగం కాదు స్ఫూర్తి. సింగపూర్ అమరావతి బృహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చి సహకరించింది. గత పాలకులు ప్రజలతో పాటు సింగపూర్ ప్రతినిధులను కూడా వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్సు భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధాని 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి తర్వాత మూడు రాజధానులని మాట తిప్పేశాడు. 201924 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం. "అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రాజధాని నిర్మాణంలో ఐదు కాన్సెప్టులు**

అమరావతి రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి వచ్చేసింది. నగర నిర్మాణంలో ఇది ప్రారంభం మాత్రమే. మూడో దశలో ఇది తాడేపల్లి వద్ద జాతీయ రహదారికి కనెక్టు అవుతుంది. అమరావతి రాజధాని పూర్తి కాలుష్య రహిత నగరంగా మారుతుంది. డీప్‌టెక్ క్యాపిటల్ గా దీనిని తయారు చేస్తున్నాం. ఐదు ముఖ్యమైన అంశాలతో రాజధాని నిర్మాణం చేపడుతున్నాం. నో పోల్స్, బ్లూ, గ్రీన్, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం డీప్ టెక్ లాంటి ఐదు కాన్సెప్టులతో నిర్మాణం జరుగుతోంది. ఏఐ, క్వాంటం కంప్యూటర్ వ్యాలీగా అమరావతి మారుతుంది. టాప్ 5 నగరాల్లో ఒకటిగా తయారవుతుంది. అమరావతి, మంగళగిరితాడేపల్లి, గుంటూరు, విజయవాడ కార్పొరేషన్లు రాజధాని పరిధిలోనే ఉంటాయి. 190 కిలోమీటర్ల అవుటర్, 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగురోడ్డు మంజూరు చేసిన కేంద్రానికి ధన్యవాదాలు. 2028 నాటికి భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. సింధూ నాగరికత తరహాలోనే రాజధాని నగరంలో సీడ్ యాక్సెస్ రహదారులు నిర్మాణం జరుగుతున్నాయి. ఇక అమరావతి అన్ స్టాపబుల్. రాజధాని లో నిర్మిస్తున్న రోడ్డును అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించారు. ఈ తరహా వ్యక్తులతో రాష్ట్రానికి చాలా ప్రమాదం. రాష్ట్రాభివృద్ధి కోసం నిర్దుష్టమైన లక్ష్యాలను పెట్టుకుంటున్నాం". అని సీఎం అన్నారు. "2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నాం. ప్రజలు వ్యక్తులుగా మీరేం సంకల్పం తీసుకున్నారు. 80వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయండి. అనునిత్యం మీ సంకల్పాన్ని నెరవేర్చుకునే ఆలోచనలు చేస్తే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యం అవుతుంది. మనకు స్వాతంత్య్రం ఎందుకు వచ్చిందన్న అంశాన్ని అంతా మర్చిపోతున్నాం. జెండా వందనంతో పాటు దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేలా ఆలోచనలు చేయటం ముఖ్యం. రైతులు, విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు ఎవరైనా తమ తమ స్థాయిల్లో కృషి చేయాలి. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలి. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలి. ఓ ప్రజా ఉద్యమంగా తిరంగా ర్యాలీ జరగాలి. వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. ఆ శక్తి సామర్థ్యాలను ప్రజలే అందించాలి. అమరావతి రాజధాని అభివృద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలి. అమరావతి ఆర్థిక రాజధానిగా ఎదగాలి. "అని సీఎం అన్నారు. అనంతరం మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రవణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణలతో కలిసి రాయపూడి వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని సీఎం పరిశీలించారు.



# వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**అభినందనలు తెలిపిన వరంగల్ సీపి**

**వరంగల్, క్రైమ్ మహా ;** వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో రాణి రుద్రమ దేవి ప్రాంగణంలో పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గానికి నిర్వహించిన ఎన్నికల్లో పోలీస్ అధికారులు పోలీస్ అధికారుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత,ఐపిఎస్ అదేశాలతో ఎన్నికల నోడల్ అధికారి అదనపు డిసిపి ప్రభాకర్ రావు, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డిసిపి శ్రీనివాస్, ఏసిపిలు సదయ్య, నాగయ్యల పర్యవేక్షణలో ఈ ఎన్నికలు నిర్వహించ బడ్డాయి. ఈ ఎన్నిక సందర్బంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్నికలు జరుగుతున్న ప్రాంతానికి చేరుకోని ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించడం తో పాటు, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందు తీసుకోవాల్సిన చర్యల పై పోలీస్ కమిషనర్ నోడల్, ఎన్నికల నిర్వహణ అధికారులకు పలు సూచనలు చేసారు.గురువారం నిర్వహించిన ఎన్నికల్లో 110 వివిధ హోదాలు కలిగిన పోలీస్ అధికారులు తమ ఓటు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో కానిస్టేబుల్ కొండా కరుణాకర్ (ధర్మసాగర్ పోలీస్ స్టేషన్), ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ టి.బాబుపై 17 ఓట్ల ఆధిక్యంతో వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా బి.సతీష్( ఆర్.ఐ), బి.శరత్ కుమర్ (ఆర్.ఎస్.ఐ), ప్రధాన కార్యదర్శి గా ఇ.వీరభద్ర రావు (దామెర ఎస్.ఐ), సంయుక్త కార్యదర్శి టి.నరేష్ ( కాజీపేట కానిస్టేబుల్), కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్. ప్రవీణ్ కుమార్ (ఎ.ఆర్ కానిస్టేబుల్), కోశాధికారి బి. నరేష్ (పాలకుర్తి కానిస్టేబుల్), కార్యనిర్వహక సభ్యులుగా యం. తులసి (మహిళా కానిస్టేబుల్ కాజీపేట), సి.హెచ్ మహెందర్ యాదవ్ (ఎ.ఆర్ కానిస్టేబుల్), ఏ.రమేష్ (ఎ.ఆర్ కానిస్టేబుల్),ఎన్. ప్రవీణ్ (సుబేదారి కానిస్టేబుల్), యం.డి తాజుద్దీన్ (హన్మకొండ ట్రాఫిక్ కానిస్టేబుల్), పి.సర్వేశ్ (పాలకుర్తి కానిస్టేబుల్) ఎన్నికైయ్యారు. ఈ సందర్బంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపిఎస్ వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం సభ్యులకు అభినందనలు తెలిపారు



# మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వద్దు

- **ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి**
- **ఎంఈఓ కార్యాలయం ముందర సీఐటీయు నిరసన**

**మంచిర్యాల, మహా :** మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వద్దని సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో గురువారం రోజున నస్పూర్, జైపూర్, భీమారం మండలల్లోని ఎంఈఓ కార్యాలయల ఎదుట నిరసన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్మికులతో నాణ్యమైన భోజనం నిర్వహణ కొనసాగుతోందని చెప్పారు. వీరు గత 15, 20 సంవత్సరాలుగా కార్మికులు పని చేస్తున్నారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెలా 10 వేల రూపాయలు వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.. ఇలా ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బూటకపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోందని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేసుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచే అటువంటి స్కావెంజర్లకు గత సంవత్సరం ఏప్రిల్ నెల, ఇప్పుడు జూన్ నుండి నేటి వరకు ప్రభుత్వం జీతాలు చెల్లించలేదని ఆరోపించారు. జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణకు ప్రతిరోజు వారి ఖర్చులకు ఆర్థిక భారం పడుతుందన్నారు. అనంతరం తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మదనమ్మ, సరితలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంను గెలిపిస్తే మాకు 10 వేలు జీతం వస్తుందని ఆశపడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు జీతాలు పెంచకుండా మమ్మల్ని విధులనుండి పూర్తిగా వెళ్లగొట్టడానికే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. వీరి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్చార్జి మంత్రి, చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి మధ్యాహ్న భోజన నిర్వహణను యధావిధిగా కార్మికులతోనే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోమాసే ప్రకాష్, పాయిరాల రాములు రజక సంఘం జిల్లా కార్యదర్శి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుల సవిత, కార్మికులు లక్ష్మి, సుశీల శంకరమ్మ నాగమణి భీమక్కా రాజు తదితరులు పాల్గొన్నారు.

# సిమెంటు, ఇటుకలు, ఏఐ

**భారత రియల్ ఎస్టేట్ రంగంలో జోరుగా ఏఐ వినియోగం**

**హైదరాబాద్, మహా :** భారత రియల్ ఎస్టేట్ రంగం రూపురేఖలు వేగంగా మారుతున్నాయి. సిమెంట్, ఇటుకల వంటి సంప్రదాయ సామగ్రితో పాటు ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ఈ రంగంలో కీలక శక్తిగా మారుతోంది. గతంలో కేవలం కస్టమర్లను ఆకట్టుకునే వర్చువల్ టూర్లు, చాట్‌బాట్‌లకు పరిమితమైన ఏఐ, ఇప్పుడు నిర్మాణ రంగం మూలాల్లోకి చొచ్చుకెళ్లి ప్రణాళిక, వ్యయ నియంత్రణ, ప్రాజెక్టుల నిర్వహణలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం భారతదేశ రియల్ ఎస్టేట్ మార్కెట్ విలువ సుమారు 650 బిలియన్ డాలర్లు కాగా, 2047 నాటికి ఇది 5.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఇండియా బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్ అంచనా వేసింది. ఈ భారీ వృద్ధిని అందుకోవాలంటే నిర్మాణంలో వేగం, సామర్థ్యం పెరగడం తప్పనిసరి. ఇక్కడే ఏఐ డెవలపర్లకు కొత్త మార్గాన్ని చూపిస్తోంది. రాబోయే ఏడేళ్లలో ఒక్క జనరేటివ్ ఏఐ వాడకం వల్ల రియల్ ఎస్టేట్ స్థూల విలువకు సుమారు 1417 బిలియన్ డాలర్లు అదనంగా జత అవుతాయని ఈవైపార్థినాన్, క్రెడాయ్ సంస్థల సంయుక్త నివేదిక పేర్కొంది. గతంలో ఏఐ అంటే డిజిటల్ మార్కెటింగ్, వ్యక్తిగత సిఫార్సులు మాత్రమే. కానీ ఇప్పుడు "ఏఐ ఏం చేయగలదు?" అనే ప్రశ్న స్థానంలో "మన తదుపరి ప్రాజెక్టులో ఏఐని ఎంత వేగంగా అమలు చేయాలి?" అనే చర్చ మొదలైంది. ఏ ప్రాజెక్టు ఎప్పుడు, ఎక్కడ నిర్మించాలి, ఖర్చు ఎంత అవుతుంది, నిర్మాణంలో ఎదురయ్యే రిస్కులను ముందుగానే ఎలా గుర్తించాలి వంటి కీలక నిర్ణయాల్లో ఏఐ ప్రధాన పాత్ర పోషిస్తోంది



# ప్రజల భద్రతే అత్యంత ప్రాధాన్యం

**ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి**

**బల్దియా కమిషనర్ టి.వెంకన్న**

**వరంగల్, కార్పొరేషన్ మహా;** గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని కమర్షియల్ భవనాల యాజమాన్యాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, భవనాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ పరికరాలను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలని సూచించారు.గురువారం హన్మకొండ పరిధిలో ఫైర్ సేఫ్టీ నిర్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీకి సంబంధించి ఎర్రగట్టుగుట్ట వద్ద ఉన్న షైన్ పాఠశాలతో పాటు భీమారంలోని ఎస్ఎస్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టీ పరికరాలను కమిషనర్ పరిశీలించారు. అగ్ని ప్రమాదాల సమయంలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా పరికరాలు అందుబాటులో ఉన్నాయా, అవి నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేశారా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరికరాల ఏర్పాటు, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం వరంగల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బల్దియా ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపట్టి



పూర్తిచేసిన 22వ డివిజన్‌లోని సుజిత్‌సింగ్‌నగర్, 13వ డివిజన్‌లోని ఎం.హెచ్.నగర్‌లో నిర్మించిన సీబిట్ కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు ప్రక్రియ కోసం పనుల నాణ్యత, పురోగతి తదితర వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.19వ డివిజన్ పరిధిలోని సొసైటీ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) నిర్మాణ పనులను కూడా కమిషనర్ పరిశీలించారు. అలాగే కరీమాబాద్, బట్టల బజార్ ప్రాంతాల్లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతి, నాణ్యత, బిల్లుల చెల్లింపునకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఫైర్ సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేసి, పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను నిబంధనల మేరకు చేపట్టాలని సూచించారు.. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో జిల్లా ఫైర్ అధికారి శంకర్ లింగం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్‌బాబు, డిప్యూటీ ఇంజనీర్ రంగారావు, స్టేషన్ ఫైర్ అధికారి రాజేశ్వర్ రావు, అసిస్టెంట్ ఇంజనీర్లు మురళీకృష్ణ, బాబు తదితరులు పాల్గొన్నారు.



# ఖర్గే సభ జరిగిన చోట శుద్ధీకరణ హోమం

**ఢిల్లీ, మహా :** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన ప్రదేశంలో 'శుద్ధీకరణ' పేరుతో హోమం చేయడం రాజకీయ దుమారం రేపింది. ఈ అంశం గురువారం రాజ్యసభను కుదిపేసింది. ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయగా.. కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందించారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. బీజేపీ ఇలాంటి చర్యలను సమర్థించదని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8న ఖర్గే 'విజయ శంఖనాద' సభ నిర్వహించారు. రెండు రోజుల తర్వాత శ్రీరామ్ సేనకు చెందిన కార్యకర్తలు అక్కడ హోమం చేసి వేదికను 'శుద్ధి' చేసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. రాజ్యసభలో ఖర్గే మాట్లాడుతూ.. తన సభకు లక్షలాది మంది హాజరయ్యారని చెప్పారు. తాను ఏ మతం లేదా వర్గం గురించి మాట్లాడలేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే మాట్లాడానని తెలిపారు. అయినా తన ప్రసంగం తర్వాత వేదికకు శుద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్య పద్ధతేనా? రాజ్యాంగాన్ని ఎలా కాపాడుతున్నారని నిలదీశారు. ఈ ఘటనను ఖండించిన రాజ్యసభ ఛైర్మన్.. అంటరానితనం కంటే పెద్ద పాపం మరొకటి లేదని వ్యాఖ్యానించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖర్గే దళితుడు కావడంతోనే శుద్ధి చేశారని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్ గోదియాల్ ఆరోపించారు. దీనికి బీజేపీ రాష్ట్ర నేత ఖజన్ దాస్ స్పందించారు. ఖర్గే సభలో చేసిన కొన్ని నినాదాలు సనాతన వర్గాల మనోభావాలను దెబ్బతీశాయని చెప్పారు. రామ్‌లీలా మైదానం మతపరమైన ప్రాధాన్యం ఉన్న ప్రాంతమని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణమే స్పందించాలి

**వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు బల్దియా కమిషనర్ టి.వెంకన్నతో కలిసి డివిజన్ సమస్యల పై సమీక్ష**

**వరంగల్ కార్పొరేషన్ మహా :** ప్రజా సమస్యల పట్ల అధికారులు తక్షణమే స్పందించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో చర్యలు చేపట్టాలని వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్ నాగరాజు సూచించారు.వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్ లో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారంపై గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. బల్దియా కమిషనర్ టి.వెంకన్నతో కలిసి ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు సమావేశంలో పాల్గొని, డివిజన్ లోని సమస్యలపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు శానిటేషన్, ఇంజినీరింగ్, శ్మశానవాటికలు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, విద్యుత్ తదితర సమస్యలను ఎమ్మెల్యే, కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు మాట్లాడుతూ, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. నగరంలో సమగ్ర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు ముఖ్యమంత్రి పెద్దఎత్తున నిధులు కేటాయించారని, అందులో కొంత భాగం తన నియోజకవర్గానికి, ముఖ్యంగా 14వ డివిజన్ కు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.డివిజన్ లో నెలకొన్న సమస్యలను అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కబ్జాల నియంత్రణకు చర్యలు చేపట్టామని తెలిపారు. తన నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో విలీన గ్రామాలు ఉన్నాయని, మడికొండ, హసన్ పర్తి, మామునూరు ప్రాంతాల్లో పేద, సామాన్య ప్రజలు అధికంగా నివసిస్తున్నారని పేర్కొన్నారు.భారీ



వర్షాలు కురిసిన సమయంలో ఇళ్లలోకి మురుగునీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు ప్రజల సమస్యలను మానవీయ కోణంలో పరిగణించి శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే సూచించారు.

**సమస్యలు పరిష్కరిస్తాం కమిషనర్ టి వెంకన్న**

ఈ సందర్భంగా బల్దియా కమిషనర్ టి.వెంకన్న మాట్లాడుతూ, 14వ డివిజన్ లో గుర్తించిన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డివిజన్‌లో ఇంజినీరింగ్‌కు సంబంధించి 62 పనులు మంజూరు కాగా, 39 పనులు పూర్తయ్యాయని, 8 పనులు పురోగతిలో ఉన్నాయని, మరో 8 పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. మిగిలిన పనులు అగ్రిమెంట్ దశలో ఉన్నాయని తెలిపారు.స్థానికులు ప్రస్తావించిన వీధి దీపాల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని, శానిటేషన్ వాహనాలకు డ్రైవర్లను త్వరితగతిన నియమించి సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.2020-21లో నిర్వహించిన సర్వేలో జరిగిన పొరపాట్ల కారణంగా నీటి సరఫరా లేకపోయినా బిల్లులు వస్తున్న సమస్య తమ దృష్టికి వచ్చిందని, దీనిని సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. శ్మశానవాటికకు సంబంధించిన సమస్యను కూడా యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని తెలిపారు.ఇంటి నంబర్ల కేటాయింపుపై కమిషనర్ వివరిస్తూ, ప్రస్తుతం ఉన్న నంబర్లకు సంబంధించిన నోటరీ పత్రాలు సమర్పించిన వారికి హోల్డర్ నంబర్లు కేటాయిస్తున్నామని, పూర్తి స్థాయి ఇంటి నంబర్ల కేటాయింపుపై ప్రభుత్వం నుంచి నిర్ణయం రావాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, వెటర్నరీ వైద్యులు గోపాల్‌రావు, ఎంహెచ్‌ఓ డా. రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంతోష్‌బాబు, ఏసీపీ ఖలీల్, డీఈలు, ఏఈలు, స్థానిక డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేను మాజీ సీఎంను.. కనీస మర్యాద లేదా?

**కర్నూలు, మహా :** రాష్ట్రంలో అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు ఘటనే నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్యే విరూపాక్షిని గురువారం ఆయన ములాఖత్‌లో భాగంగా కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాను ఇవాళ జైలుకు వస్తే తనను కూడా అవమానించే ప్రయత్నం చేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక మాజీ ముఖ్యమంత్రిగా వచ్చిన నన్ను లోపల కూర్చోబెట్టి ఫోటో తీయకుండా, గ్రిల్స్ బయట నిలబెట్టి ఫోటో తీశారు. ఇది చంద్రబాబు శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనం. మా హయాంలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లు తీసుకొస్తే, వీళ్లు అవమానించే సంస్కృతిని తెచ్చారు" అని అన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "ఈరోజు మీరు ఏ తప్పుడు విత్తనాలు నాటుతున్నారో, అవే రేపు మహావృక్షాలై మిమ్మల్ని రెండింతలుగా చుట్టుకుంటాయి. ఈ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు" అని జగన్ హెచ్చరించారు. సమయం వేగంగా గడిచిపోతుందని, ఈ దుర్మార్గపు పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని ఆయన వ్యాఖ్యానించారు. "ఈ వెన్నుపోటు పార్టీ పాలనలో బాధితులే నిందితులుగా మారుతున్నారు. దాడికి గురైన వారిపైనే కేసులు పెడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. దీనికి విరూపాక్షి ఉదంతమే ప్రబల ఉదాహరణ" అని జగన్ పేర్కొన్నారు. ఆగస్టు 1న చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో తమ పార్టీ కార్యకర్త గిరి తనపై దాడి జరుగుతోందని, రక్షించమని రాత్రి 7:45



గంటలకు ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేసి, వీడియోలు పంపాడని జగన్ ఆధారాలను చూపుతూ వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక ఎస్సైకి 7:47 గంటలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదన్నారు. పైగా, కార్యకర్తను కాపాడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపై దాడి చేశారని, ఆయన తమ్ముడి చేయి విరగ్గొట్టారని ఆరోపించారు. దాడికి గురైన విరూపాక్షి ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోగా, అర్ధరాత్రి 2:45 గంటలకు వందల మంది పోలీసులు దొంగల్లా ఆయన ఇంటిపై పడి, తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఒక ఉగ్రవాదిని పట్టుకున్నట్లు అరెస్టు చేశారని జగన్ మండిపడ్డారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి మొత్తం 38 మందిపై మూడు వేర్వేరు అక్రమ కేసులు బనాయించి జైల్లో ట్టారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో రెండుసార్లు చేర్చడం చూస్తే, కేసు ఎంత కట్టుకథో అర్థమవుతోందన్నారు.



# ఏజెన్సీ జర్నలిస్టులకు ప్రత్యేక ఉత్తర్వులతో ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలి

**అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా :** జిల్లా 90 శాతానికి పైగా ఏజెన్సీ ప్రాంతంగా ఉంది. జిల్లాలో 1,225 మంది జర్నలిస్టులు వివిధ పత్రికలు, ఛానళ్లలో విధులు నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ చట్టాల పేరుతో జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించకపోవడం వారి కనీస హక్కులను హరించడమేనని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ పేర్కొంది.జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ మొబగాపు ఆనంద్‌కుమార్, సంయుక్త కన్వీనర్ తోకల నాగేశ్వరరావు, కోకన్వీనర్ కే. దామోదర్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం సమర్పించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లు, రెండు పడక గదులు, మూడు పడక గదుల పథకాలలో చేర్చాలని కోరారు. ఏజెన్సీ చట్టాల పేరుతో ఈ అంశాన్ని వాయిదా వేయకుండా ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులందరికీ రూ.5 లక్షల ఆరోగ్య బీమాతో పాటు నగదు రహిత వైద్య సేవలు అందేలా ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కోరారు. 60 ఏళ్లు దాటిన సీనియర్ జర్నలిస్టులకు నెలకు రూ.10 వేల పింఛన్ అందించాలని, విధి నిర్వహణలో జర్నలిస్టులు మృతి చెందితే వారి కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టులపై దాడులు జరిగితే పోలీస్‌స్టేషన్లలో వెంటనే ప్రథమ సమాచార నివేదిక నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు. ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రెస్‌క్లబ్ భవనాలను నిర్మించాలని, చిన్న పత్రికలు, వెబ్ పోర్టళ్లకు కూడా ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



## ఒకే రక్త పరీక్షతో పలు క్యాన్సర్లు, కాలేయ వ్యాధుల గుర్తింపు

**కొత్త విధానంతో వ్యాధుల ఆనవాళ్లను గుర్తించే అవకాశం****

లాస్ ఏంజెలెస్: ఒకే రక్త నమూనాతో పలు రకాల క్యాన్సర్లు, కాలేయ వ్యాధులు, కొన్ని అవయవాల సమస్యలను గుర్తించే అవకాశమున్న కొత్త పరీక్షను అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, లాస్ ఏంజెలెస్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. 'మిథైల్‌స్కాన్'గా పిలుస్తున్న ఈ విధానం ప్రస్తుతం ప్రాథమికt పరిశోధన దశలో ఉంది. సాధారణ వైద్య పరీక్షగా అందుబాటులోకి రావడానికి మరింత విస్తృత స్థాయి అధ్యయనాలు అవసరం.రక్తంలోకి సహజంగా విడుదలయ్యే కణరహిత డీఎన్ఏ ముక్కలను ఈ పరీక్ష విశ్లేషిస్తుంది. వీటిలోని డీఎన్ఏ మిథైలేషన్ నమూనాలను పరిశీలించడం ద్వారా శరీరంలోని వివిధ కణజాలాల్లో జరుగుతున్న మార్పులను గుర్తించే ప్రయత్నం చేస్తారు. పరిశోధకుల ప్రకారం, క్యాన్సర్ కణాలతో పాటు వ్యాధిగ్రస్తమైన లేదా దెబ్బతిన్న అవయవాల నుంచి వచ్చే డీఎన్ఏ సంకేతాలను కూడా ఈ విధానం గుర్తించగలదు.

**పరీక్ష ఎలా పనిచేస్తుంది?**

మన శరీరంలోని కోట్లాది కణాలు ప్రతిరోజూ సహజంగా చనిపోతుంటాయి. ఈ సమయంలో వాటి నుంచి చిన్న చిన్న డీఎన్ఏ ముక్కలు రక్తంలోకి విడుదలవుతాయి. వీటినే కణరహిత డీఎన్ఏగా పిలుస్తారు. శరీరంలోని వివిధ అవయవాల నుంచి వచ్చే ఈ డీఎన్ఏలో ఆయా కణజాలాల ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన సంకేతాలు ఉంటాయి.అయితే రక్తంలో లభించే కణరహిత డీఎన్ఏలో అధిక భాగం సాధారణ రక్తకణాల నుంచే వస్తుంది. దీంతో క్యాన్సర్ లేదా దెబ్బతిన్న అవయవాల నుంచి వచ్చే స్వల్ప పరిమాణంలోని డీఎన్ఏను గుర్తించడం కష్టమవుతుంది. ఈ సమస్యను తగ్గించేందుకు పరిశోధకులు ప్రత్యేక ఎంజైమ్‌ల సాయంతో సాధారణ రక్తకణాల నుంచి వచ్చే నేపథ్య డీఎన్ఏను తగ్గించి, వ్యాధికి సంబంధించిన మిథైలేషన్ సంకేతాలను ఎక్కువగా గుర్తించే విధానాన్ని రూపొందించారు.

**మిథైలేషన్ అంటే ఏమిటి?**

డీఎన్ఏపై కొన్ని రసాయన సమూహాలు చేరే ప్రక్రియను మిథైలేషన్ అంటారు. ఇది జన్యువుల పనితీరును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. వివిధ అవయవాల కణజాలాల్లో మిథైలేషన్ నమూనాలు భిన్నంగా ఉంటాయి. వ్యాధి లేదా క్యాన్సర్ ఏర్పడినప్పుడు ఈ నమూనాల్లో మార్పులు చోటుచేసుకోవచ్చు. ఈ మార్పులను విశ్లేషించడం ద్వారా వ్యాధికి సంబంధించిన సంకేతాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

**పరిశోధనలో ఏం తేలింది?**

ఈ అధ్యయనంలో 1,061 మంది నుంచి సేకరించిన రక్త నమూనాలను పరిశీలించారు. కాలేయం, ఊపిరితిత్తులు, అండాశయం, కడుపు క్యాన్సర్లతో పాటు హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, మద్యపానంతో సంబంధం ఉన్న కాలేయ వ్యాధి, జీవక్రియలకు సంబంధించిన కాలేయ సమస్యలు ఉన్నవారి నమూనాలను కూడా పరిశీలించారు. అన్ని దశల్లోని నాలుగు రకాల క్యాన్సర్లను కలిపి గుర్తించే పరీక్షలో 98 శాతం ప్రత్యేకత వద్ద సుమారు 63.3 శాతం సున్నితత్వం నమోదైంది. ప్రారంభ దశ క్యాన్సర్లలో ఈ సున్నితత్వం సుమారు 55.3 శాతంగా ఉంది. అధిక ప్రమాదం ఉన్న కాలేయ క్యాన్సర్ రోగుల సమూహంలో సుమారు 79.6 శాతం సున్నితత్వం నమోదైంది. వ్యాధి ఏ అవయవం నుంచి వచ్చిందో గుర్తించే అవకాశంఈ పరీక్షలోని మరో ముఖ్యమైన అంశం వ్యాధి సంకేతం ఏ అవయవం నుంచి వస్తుందో అంచనా వేయడం. రక్తంలోని మిథైలేషన్ నమూనాలను విశ్లేషించడం ద్వారా కాలేయం, ఊపిరితిత్తులు, అండాశయం, కడుపు వంటి అవయవాలకు సంబంధించిన సంకేతాలను గుర్తించే అవకాశం ఉన్నట్లు పరిశోధకులు తెలిపారు. పరీక్షలో అనుమానాస్పద ఫలితం వస్తే, ఆ అవయవాన్ని లక్ష్యంగా చేసుకుని తదుపరి చిత్రీకరణ పరీక్షలు లేదా ఇతర నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉంటుంది.

**ఇంకా పరిశోధన అవసరం**

మిథైల్‌స్కాన్ ఫలితాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, దీనిని ప్రస్తుతం క్యాన్సర్‌ను ఖచ్చితంగా నిర్ధారించే పరీక్షగా పరిగణించలేం. సాధారణ ప్రజల్లో పెద్ద ఎత్తున నిర్వహించే భవిష్యత్ అధ్యయనాల ద్వారా దీని పనితీరు, పరిమితులు, వైద్యపరమైన ఉపయోగాన్ని మరింతగా నిర్ధారించాల్సి ఉంది. అనుమానాస్పద ఫలితం వచ్చినప్పుడు వైద్యులు సూచించే తదుపరి నిర్ధారణ పరీక్షలు అవసరమే.ఈ పరిశోధన 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్'లో ప్రచురితమైంది. ఒకే రక్త నమూనాతో పలు వ్యాధులకు సంబంధించిన సంకేతాలను గుర్తించే తక్కువ ఖర్చుతో కూడిన విధానాన్ని అభివృద్ధి చేయడంలో ఈ పరిశోధన ఒక ముందడుగుగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

# ప్రతిపక్షాల వ్యూహాత్మక దెబ్బ



భారతీయ ప్రజాస్వామ్య చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా, ఊహకందని మలుపులతో ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు అధికార ఎన్డీఏ కూటమికి ఒక పెను సవాల్‌గా మారాయి. బెంగాల్ ఎన్నికల ఫలితాల జోరుతో, సంఖ్యాబల గర్వంతో రెచ్చిపోయిన కేంద్ర ప్రభుత్వ అంచనాలను విపక్షాలు కేవలం తమ రాజకీయ చతురతతో తలక్రిందులు చేశాయి. అట్టడుగు స్థాయి నుంచి యువత, విద్యార్థుల ఉద్యమం అందించిన ఊపును అందిపుచ్చుకుంటూ, పార్లమెంట్ ఉభయ సభలను రణరంగంగా మార్చి మోదీ సర్కార్‌ను గట్టి డిఫెన్స్‌లో పడేశాయి. ప్రతిష్ఠాత్మక బిల్లులను అడ్డుకోవడమే కాకుండా, ప్రాంతీయ పార్టీలను సైతం ఏకం చేసి ప్రభుత్వ ఏకపక్ష ధోరణికి అడ్డుకట్ట వేసిన విపక్షాల ఈ వ్యూహాత్మక దెబ్బ... దేశ రాజకీయ యవనికపై సరికొత్త సమీకరణాలకు తెరలేపింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. భారత రాజకీయంలో ఇవి ఒక కొత్త చర్చకు తెరలేపాయి. జులై 20న సమావేశాలు ప్రారంభమైన సమయానికి, బెంగాల్ ఎన్నికల ఫలితాలు , వివిధ పార్టీల ఎంపీల చేరికతో అధికార ఎన్డీఏ కూటమి పూర్తి ఆధిక్యంలో కనిపించింది. ప్రతిపక్షాలు తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం సభలో సులభంగానే తన అజెండాను నెరవేర్చుకుంటుందని విశ్లేషకులు భావించారు. కానీ, సభ ముగిసే సమయానికి సీన్ పూర్తిగా తిరగబడింది. విద్యార్థుల ఉద్యమం ఇచ్చిన మైలేజీని వ్యూహాత్మకంగా వాడుకున్న విపక్షాలు, పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని గట్టి డిఫెన్స్‌లో పడేశాయి. ఈ సమావేశాల్లో మోదీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ముందుకు తెచ్చిన అనేక బిల్లులు ప్రతిపక్షాల ఆందోళనల హోరులో కొట్టుకుపోయాయి. దేశ రాజకీయ చిత్రాన్ని మార్చే నియోజకవర్గాల పునర్విభజన రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు.. 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్' బిల్లు, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ బిల్లు, అరెస్ట్ అయిన ప్రజాప్రతినిధుల తొలగింపు బిల్లులు ఆమోదం పొందలేకపోయాయి. ముఖ్యంగా డెలిమిటేషన్ విషయంలో డీఎంకే మద్దతు కూడగట్టాలని కేంద్రం భావించినప్పటికీ, కాంగ్రెస్ నాయకత్వంలో విపక్షాలు అమలు చేసిన పక్కా వ్యూహంతో ప్రాంతీయ పార్టీలేవీ ఎన్డీఏ వైపు మొగ్గు చూపలేకపోయాయి. ఫలితంగా లోక్‌సభ పర్ఫామెన్స్ కేవలం 19 శాతానికి, రాజ్యసభ 39 శాతానికి పడిపోయింది.

**విద్యార్థుల పోరుతో దిగొచ్చిన సర్కార్**

దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన 'చలో సంసద్' పిలుపు ఈ సమావేశాలకు ప్రధాన మలుపుగా మారింది. నిరసన తెలుపుతున్న అహింసయుత విద్యార్థులపై పోలీసులు పెల్లెట్ తుపాకులు వాడారనే ఆరోపణలను ప్రతిపక్షాలు అస్త్రంగా మలచుకున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధితులైన విద్యార్థులను కలవడం, ప్రధాని నివాసం వద్ద అనూహ్య ధర్నాకు దిగడం వంటి చర్యలతో రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగింది. ఈ నిరసనల ఒత్తిడి ఏ స్థాయిలో ఉందంటే.. ఏకంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. విద్యార్థులపై పోలీసుల ప్రవర్తనపై హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబట్టాయి. గత బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షాలపై విరుచుకుపడిన అమిత్ షా, ఈ సమావేశాల్లో మాత్రం విపక్షాల నిరసనల నడుమ చివరి రోజు మాత్రమే లోక్‌సభలో స్వల్ప సమయం కనిపించడం గమనార్హం. సభ ముగింపు సందర్భంగా స్పీకర్ ఇచ్చే సాంప్రదాయ తేనీటి విందుకు కూడా "హోంమంత్రి ఉంటే మేము రాము" అని కాంగ్రెస్ తెగేసి చెప్పడం.. ప్రభుత్వం , విపక్షాల మధ్య పెరిగిన తీవ్రమైన వైరాన్ని స్పష్టం చేస్తోంది. ఏకపక్షంగా సాగుతుందనుకున్న వర్షాకాల సమావేశాలలో ప్రతిపక్షం తీవ్రమైన ప్రతిఘటనను ఎదురొడ్డి నిలిపింది. ప్రజా సమస్యలను, విద్యార్థుల ఆక్రోశాన్ని పార్లమెంట్ అజెండాగా మార్చడంలో విపక్షాలు సాధించిన ఈ విజయం.. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంట్ లోనూ, బయట కూడా మరిన్ని సవాళ్లు విసిరే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## పార్లమెంట్ లో వందేమాతరం

**(మహా నెట్ వర్క్) :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గురువారం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. గురువారం లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జన గణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకా విష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది



# కంటి ఒత్తిడి తగ్గితే చూపుపై ప్రభావం



హైపోటోనీపై అప్రమత్తత అవసరం.. కారణాలు, లక్షణాలు, చికిత్సపై వైద్యుల సూచనలుకంటి ఆరోగ్యం విషయంలో చిన్న మార్పులను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. సాధారణంగా కంటిలోపలి ఒత్తిడి ఒక నిర్దిష్ట పరిధిలో ఉంటుంది. ఈ ఒత్తిడి అసాధారణంగా తగ్గినప్పుడు దాన్ని కంటి హైపోటోనీగా పిలుస్తారు. వైద్యపరంగా సాధారణంగా కంటి ఒత్తిడి 6.5 ఎంఎం హెచ్‌జీ కంటే తక్కువగా ఉన్నప్పుడు హైపోటోనీగా పరిగణించే నిర్వచనం ఉంది. అయితే కేవలం ఒత్తిడి విలువ ఆధారంగానే సమస్య తీవ్రతను నిర్ణయించరు. చూపు తగ్గడం, కంటి నిర్మాణంలో మార్పులు వంటి లక్షణాలు ఉన్నాయా? ఒత్తిడి ఎంతకాలం తక్కువగా ఉంది? దానికి కారణం ఏమిటి? వంటి అంశాలను కూడా వైద్యులు పరిగణనలోకి తీసుకుంటారు.

కంటిలోపల ఉండే ద్రవం ఉత్పత్తి, బయటకు వెళ్లే విధానం మధ్య సమతుల్యత కంటి ఒత్తిడిని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సమతుల్యత దెబ్బతింటే కంటి ఒత్తిడి తగ్గవచ్చు. ముఖ్యంగా కంటి శస్త్రచికిత్సల అనంతరం ద్రవం ఎక్కువగా బయటకు వెళ్లడం, శస్త్రచికిత్స చేసిన ప్రాంతంలో లీకేజీ ఏర్పడటం, కంటి లోపల వాపు రావడం, తీవ్రమైన గాయం కావడం వంటి కారణాలతో హైపోటోనీ ఏర్పడే అవకాశం ఉంటుంది.

**మాక్యులాపై ప్రభావం**

కంటి ఒత్తిడి ఎక్కువకాలం తక్కువగా ఉంటే కంటి వెనుక భాగంలోని రెటీనా, కొరాయిడ్ నిర్మాణాల్లో మార్పులు రావచ్చు. ముఖ్యంగా చూపులో అత్యంత కీలకమైన మాక్యులా ప్రాంతంలో మడతలు ఏర్పడే పరిస్థితిని హైపోటోనీ మాక్యులోపతి అంటారు. దీనివల్ల మధ్యలోని చూపు మసకబారడం, వస్తువులు వంకరగా కనిపించడం లేదా చూపు నాణ్యత తగ్గడం వంటి సమస్యలు రావచ్చు. కొన్ని సందర్భాల్లో లక్షణాలు పెద్దగా కనిపించకపోవచ్చు కూడా.

**ప్రధాన కారణాలేంటి?**

**కంటి శస్త్రచికిత్స తర్వాత:** గ్లకోమా కోసం చేసే కొన్ని శస్త్రచికిత్సల అనంతరం కంటి ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది. శస్త్రచికిత్స చేసిన ప్రాంతం నుంచి ద్రవం లీక్ కావడం లేదా అవసరానికి మించి ద్రవం బయటకు వెళ్లడం ఇందుకు కారణం కావచ్చు.

**కంటికి తీవ్రమైన గాయం:** కంటికి బలమైన గాయం కావడం వల్ల కంటి గోడ దెబ్బతినడం, ద్రవం బయటకు వెళ్లే మార్గంలో మార్పులు రావడం వంటి కారణాలతో ఒత్తిడి తగ్గవచ్చు.

కంటి లోపల వాపు: కొన్ని రకాల కంటి వాపు లేదా ఇన్‌ఫ్లమేషన్ వల్ల కంటిలో ద్రవాన్ని ఉత్పత్తి చేసే భాగం పనితీరు తగ్గి ఒత్తిడి పడిపోవచ్చు.

రెటీనా సంబంధిత సమస్యలు: రెటీనా ఊడిపోవడం వంటి కొన్ని పరిస్థితులతోనూ కంటి ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది.

శస్త్రచికిత్స అనంతర లీకేజీ: కంటి శస్త్రచికిత్స తర్వాత గాయం పూర్తిగా మానకపోవడం లేదా ఆ ప్రాంతంలో లీకేజీ ఏర్పడితే కంటిలోని ద్రవం బయటకు వెళ్లి ఒత్తిడి తగ్గవచ్చు.

**ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి?**

హైపోటోనీ ఉన్న ప్రతి ఒక్కరిలో ఒకే రకమైన లక్షణాలు కనిపించవు. కొందరిలో ఎలాంటి స్పష్టమైన ఇబ్బందులు లేకపోవచ్చు. మరికొందరిలో మాత్రం కింది లక్షణాలు కనిపించవచ్చు:

చూపు మసకబారడం
మధ్యలోని చూపు తగ్గడం
వస్తువులు వంకరగా లేదా ఆకారం మారినట్లుగా కనిపించడం
దూరంలోని వస్తువులపై స్పష్టంగా దృష్టి పెట్టలేకపోవడం
కంటిలో అసౌకర్యం లేదా నొప్పి
శస్త్రచికిత్స తర్వాత అకస్మాత్తుగా చూపు తగ్గడం

ముఖ్యంగా కంటి శస్త్రచికిత్స లేదా గాయం తర్వాత చూపులో అకస్మాత్తుగా మార్పు వస్తే ఆలస్యం చేయకుండా కంటి వైద్యుడిని సంప్రదించాలి.

**వైద్యులు ఎలా గుర్తిస్తారు?**

కంటి ఒత్తిడిని కొలిచేందుకు టోనోమీటర్ వంటి పరికరాలను ఉపయోగిస్తారు. అయితే కేవలం ఒత్తిడిని కొలవడం ద్వారా సమస్యకు పూర్తి కారణం తెలియదు. అవసరాన్ని బట్టి కంటి ముందు భాగాన్ని, రెటీనా, కొరాయిడ్, మాక్యులా ప్రాంతాలను వైద్యులు పరిశీలిస్తారు. ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీ వంటి చిత్రీకరణ పరీక్షల ద్వారా మాక్యులా, రెటీనా ప్రాంతాల్లో ఏర్పడిన సూక్ష్మ మార్పులను గుర్తించవచ్చు. కొన్ని సందర్భాల్లో అల్ట్రాసౌండ్ వంటి పరీక్షలు కూడా అవసరం కావచ్చు.

**చికిత్స ఎలా ఉంటుంది?**

హైపోటోనీకి అందరికీ ఒకే రకమైన చికిత్స ఉండదు. అసలు కారణాన్ని గుర్తించిన తర్వాత దానికి అనుగుణంగా చికిత్సను నిర్ణయిస్తారు.

కంటి శస్త్రచికిత్స తర్వాత ద్రవం లీక్ అవుతున్నట్లు గుర్తిస్తే, పరిస్థితిని బట్టి వైద్యులు మందులు, కంటి రక్షణ కోసం ప్రత్యేక కాంటాక్ట్ లెన్స్, లీకేజీని మూసివేసే విధానాలు లేదా అవసరమైతే శస్త్రచికిత్సను సూచించవచ్చు.

కంటి లోపల వాపు కారణంగా ద్రవం ఉత్పత్తి తగ్గినట్లయితే, వాపును నియంత్రించే చికిత్సను వైద్యులు అందిస్తారు. గాయం లేదా రెటీనా ఊడిపోవడం వంటి తీవ్రమైన కారణాలు ఉన్నప్పుడు వేగంగా చికిత్స చేయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో సమస్య కొనసాగితే పునఃశస్త్రచికిత్స అవసరమవుతుంది.

**చికిత్స ఆలస్యమైతే?**

కంటి ఒత్తిడి ఎక్కువకాలం తక్కువగా ఉండి, దాని ప్రభావం కంటి నిర్మాణాలపై పడితే రెటీనా, కొరాయిడ్, మాక్యులా ప్రాంతాల్లో మార్పులు రావచ్చు. హైపోటోనీ మాక్యులోపతి కారణంగా చూపు దెబ్బతినే అవకాశం ఉంది. అయితే ప్రతి హైపోటోనీ కేసులో శాశ్వత చూపు కోల్పోవడం తప్పనిసరి కాదు. కారణాన్ని త్వరగా గుర్తించి కంటి ఒత్తిడిని సరిచేయగలిగితే చూపు, కంటి నిర్మాణం మెరుగుపడే అవకాశం ఉంటుంది. సమస్య ఎక్కువకాలం కొనసాగితే మాత్రం శాశ్వత నష్టం కలిగే ప్రమాదం పెరుగుతుంది.

ఎప్పుడు వెంటనే వైద్యుడిని కలవాలి?

కంటి శస్త్రచికిత్స జరిగిన తర్వాత చూపు ఒక్కసారిగా తగ్గడం, వస్తువులు వంకరగా కనిపించడం, కంటిలో తీవ్రమైన అసౌకర్యం లేదా నొప్పి, కంటి రూపంలో మార్పు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించాలి. ముఖ్యంగా గ్లకోమా లేదా ఇతర కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు ఫాలోఅప్ పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదు.ముఖ్య గమనిక: కంటి ఒత్తిడి తక్కువగా ఉందని ఒక్క కొలత ఆధారంగా స్వయంగా నిర్ణయించుకోవద్దు. హైపోటోనీ నిర్ధారణకు కంటి ఒత్తిడితో పాటు కంటి నిర్మాణం, చూపు, సమస్యకు కారణం వంటి అంశాలను వైద్యుడు పరిశీలించాలి. కంటి చుక్కలు లేదా ఇతర మందుల మోతాదును వైద్యుల సూచన లేకుండా మార్చడం, నిలిపివేయడం చేయకూడదు.



# బునాదిగాని కాలువ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 13 మహా:** భువనగిరి నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ బునాదిగాని కాలువపై చేపట్టిన కొత్త బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తికావడంతో బీబీనగర్ మండలం మక్త అనంతారం వద్ద బునాదిగాని కాలువ నీటిని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గురువారం విడుదల చేశారు. బునాదిగాని కాలువపై బాక్స్ కల్వర్టుల నిర్మాణం పూర్తికావడంతో కాలువలో నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులు తొలగి, నీటిని సాఫీగా తరలించేందుకు మార్గం సుగమమైంది. దీంతో కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి విషయంలో మరింత ప్రయోజనం చేకూరనుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులకు సాగునీరు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాలువల అభివృద్ధి, ఆధునీకరణ, అవసరమైన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని అన్నారు.బునాదిగాని కాలువ పరిధిలో నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలిగించే ప్రాంతాలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గారు తెలిపారు. ఇందులో భాగంగానే కొత్త బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులను పూర్తి చేసి, కాలువ నీటిని విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. కాలువ ద్వారా విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టు వరకు సక్రమంగా చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే గారు సూచించారు. నీటి ప్రవాహంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ నియోజకవర్గ అభివృద్ధికి ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, కాలువల ద్వారా నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పొట్టోల శ్యామ్ గౌడ్, సీనియర్ నాయకులు పంజాల రామాంజనేయులు, గోలి పింగల్ రెడ్డి, గోలి నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్, పిఎసిఎస్ డైరెక్టర్లు, మండల నాయకులు,సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు,, ఈఈ శైలేందర్, డిఈ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.





# అమెరికాలో కిష్టారం యువకుడి ఆకస్మిక మృతి

- రవీంద్రబాబు(రవి) కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ మట్టా దయానంద్

**సత్తుపల్లి, ఆగస్టు 13: మహా :** అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరపడిన కిష్టారం గ్రామానికి చెందిన ములకలపాటి పార్థసారథి (పార్థు) 36సం" గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. తీవ్రమైన గుండెపోటుతో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషాద ఘటనతో కిష్టారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కిష్టారం గ్రామానికి చెందిన ములకలపాటి రవీంద్రబాబు (రవి) కుమారుడైన పార్థసారథి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆయనతోపాటు బావ ప్రముఖ వైద్యులుగా, అక్క జహన్వి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అమెరికాలోనే స్థిరపడ్డారు. కుమార్తె జహన్వి గర్భవతి కావడంతో ఆమె యోగక్షేమాలు చూసేందుకు తల్లి లీలావతి రెండు నెలల క్రితం అమెరికాకు వెళ్లారు. ఈ నేపథ్యంలో పార్థసారథి ఆకస్మికంగా మృతి చెందడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది.విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ కిష్టారంలోని రవీంద్రబాబు(రవి) నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్థసారథి మృతికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కిష్టారం గ్రామ సర్పంచ్ నరకుళ్ల రాజేశ్వరి అప్పారావు, నరకుళ్ల రవి, సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు మలిరెడ్డి మురళిరెడ్డి, కమల్ పాషా, కిష్టారం గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థుల విద్య, భోజనం, వసతులపై ప్రత్యేక దృష్టి..

- గన్నెబోయినగుంపు పాఠశాలలో ఎమ్మెల్యే పాయం ఆకస్మిక తనిఖీ..
- విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే..
- నాణ్యమైన భోజనం, మౌలిక వసతుల్లో రాజీ వద్దని సూచన..



**మణుగూరు, మహా :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మణుగూరు మండలం కట్టుమల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని గన్నెబోయినగుంపు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యాబోధన తీరును తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, మెనూ, పరిశుభ్రతతో పాటు పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎమ్మెల్యే.. చదువు ఎలా సాగుతోంది..? ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెబుతున్నారా..? పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అంటూ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతపై ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అవసరమైన భవనాల నిర్మాణం, మరమ్మతులు, నాణ్యమైన భోజనం, అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

**సమస్యలుంటే నేరుగా నా దృష్టికి తీసుకురండి..**

పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పాఠశాలకు అవసరమైన భవనాలు, మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులు, పెండింగ్ బిల్లులు లేదా ఇతర సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, సురక్షితమైన విద్యా వాతావరణం అందేలా కృషి చేస్తామన్నారు. పినపాక నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కురం రవి, జిల్లా ముఖ్య నాయకులు, మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గుండెల్లో కలెక్టర్ చేసిన సేవలకు గుర్తింపు

**పల్లె కు రాజర్షి షా గూడ గా నామకరణం**



**ఆదిలాబాద్ మహా :** పేదరికంలో మగ్గుతూ సరైన నివాసం లేక ఇబ్బందులు పడుతున్న మారుమూల కొలాం గిరిజనుల జీవితాల్లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా సరికొత్త వెలుగులు నింపారు. నిరుపేదలకు ఇళ్ల పట్టాలతో పాటు 'ఇందిరమ్మ గృహాలు' మంజూరు చేసి, వారి సొంతింటి కలను నిజం చేయడంలో చూపిన ప్రత్యేక చొరవకు గిరిజనులు నీరాజనాలు పట్టారు. తమ బతుకుల్లో మార్పు తెచ్చిన అధికారిపై ప్రత్యేక అభిమానంతో, దహిగూడ కొలాం గూడేనికి 'రాజర్షి షాగూడ' అని నామకరణం చేసుకుని తమ కృతజ్ఞతను చాటుకున్నారు.గురువారం పిప్పలధరి పంచాయతీ పరిధిలోని రాజర్షిగూడ లో పర్యటించిన జిల్లా కలెక్టర్, గ్రామంలో నిర్మాణం పూర్తయిన మూడు ఇందిరమ్మ గృహాలకు సంబంధించి గృహ ప్రవేశ వేడుకలను స్వయంగా ప్రారంభించారు. గతంలో 17 మంది పేద గిరిజనులకు ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఆయన చొరవతో మౌలిక వసతులు వేగవంతమయ్యాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో కలెక్టర్ గిరిజనులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి మరిన్ని చర్యలు చేపడతామని హామీ ఇస్తూ.. పిప్పలధరి పంచాయతీ పరిధిలో మరో 10 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గిరిజన కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు మేకలు, పాడి పశువుల యూనిట్ల మంజూరుతో పాటు మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ, డిగ్రీ చదివిన స్థానిక యువతకు ఆదిలాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.గ్రామంలో ప్రధాన సమస్యలైన కరెంట్, సెల్ నెట్‌వర్క్, రవాణా సౌకర్యాలపై కలెక్టర్ వెంటనే స్పందించారు. తరచూ విద్యుత్ నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈని ఆదేశించగా, సెల్ టవర్ నిర్మాణం కోసం స్థలం కేటాయించి నెట్‌వర్క్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆధార్ కార్డులు లేని వారికి వెంటనే కొత్త ఆధార్ల నమోదు పూర్తి చేయాలని ఇడిఎం, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అలాగే మారుమూల మామిడికోరి గ్రామానికి రోడ్డు (CD వర్క్) సౌకర్యం, జలసిరి కింద రైతులకు ఫార్మ్ పాండ్స్, అర్హులకు చేయూత పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, పిడి హౌసింగ్ పీడీ శంకర్, స్థానిక తహశీల్దార్ గోవింద్, ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు , గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# వినోబానగర్ లో ఉచిత టీబీ నిర్ధారణ శిబిరం

**జూలూరుపాడు, మహా:** జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ప్రత్యేక ఆదేశాల మేరకు మండల పరిధి వినోబానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉచిత టీబీ (క్షయ వ్యాధి) నిర్ధారణ, అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నవీన్, ఎంపీఓ తులసిరామ్ తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, అందులో భాగంగానే ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘకాలంగా దగ్గు, జ్వరం వంటి టీబీ లక్షణాలతో బాధపడుతున్న వారు వెంటనే వైద్యులను సంప్రదించి ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని, అలాగే ప్రభుత్వం అందించే ఉచిత మందులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన గ్రామ ప్రజలను కోరారు. ఈ వైద్య శిబిరంలో గ్రామ కార్యదర్శి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందితోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బాగాయత్ స్కూల్ విద్యార్థిని మృతి

**మరో నలుగురికి తీవ్ర గాయాలు**

భువనగిరి ఆగస్టు 13 మహా యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోtని బాగాయత్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విషాదం చోటుచేసుకుంది భువనగిరి పట్టణానికి చెందిన,3వ తరగతి విద్యార్థిని అలీనా (8) ఆకస్మాత్తుగా చెట్టు కొమ్మ విరిగి మీద పడడంతో తీవ్రగాయాలతో మృతి చెందింది... మరో నలుగురు విద్యార్థులకు తీవ్రగాయాలు కావడంతో బీబీనగర్ ఏమ్స్ హాస్పిటల్ కు తరలించారు చికిత్స అందిస్తున్నారు సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి 15 ఆగస్టు పురస్కరించుకొని విద్యార్థులకు ఆటల పోటీలు కబడ్డీ నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా వేప చెట్టు కొమ్మకూలి విద్యార్థులపై పడ్డది ఈ సందర్భంగా విషయం తెలిసిన వెంటనే భువనగిరి డిఎస్పి సంఘటన స్థలానికి సందర్శించారు వివరాలు తెలుసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు బిఆర్ఎస్ పార్టీ పట్టణ నాయకులు ప్రభుత్వ బాగాయత్ పాటశాలను సందర్శించి వాళ్ళ కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది..అదే విధంగా చనిపోయిన విద్యార్థిని కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున 25లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు..

# కలెక్టర్ అభినందనలు



ఆదిలాబాద్ మహా : బోధనా విధానం, మౌలిక వసతులు, ఇతర ప్రమాణాల ఆధారంగా ఐఐఆర్ఎఫ్ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో రిమ్స్ వైద్య కళాశాల జాతీయ స్థాయిలో 139వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షాను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యుల బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పూలమొక్కను అందజేసి ర్యాంకింగ్స్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వైద్య కళాశాలలో విద్యార్థులకు అందుతున్న నాణ్యమైన విద్య, సౌకర్యాల ఫలితంగానే ఈ గుర్తింపు లభించిందని డైరెక్టర్ తెలిపారు. ఈ ఘనత సాధించిన రిమ్స్ పాలకవర్గాన్ని, అధ్యాపకులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సేవలందించి ఇంకా మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు నరేష్, శిరీష్, సందీప్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

# సింగరేణి యజమాన్యం మారు పేర్ల సమస్యలను పరిష్కరించాలి

- కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు టి ఎన్ టి యు సి సంపూర్ణ మద్దతు
- (టిఎన్టియుసి) సింగరేణి కాలరీస్ లేబర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణీరాం సింగ్ వెల్లడి

**బెల్లంపల్లి, మహా :** సింగరేణిలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మెడికల్ బోర్డు కు అప్లై చేసుకుని మెడికల్ అన్ఫిట్ అయిన ఉద్యోగస్తుల పిల్లలకు మారుపేర్ల సమస్యతో కారుణ్య నియామకాల ద్వారా ఎంపికైన కార్మిక వారసులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని సింగరేణి యాజమాన్యం వెంటనే సమస్యను తొలగించేలా చర్యలు చేపట్టాలని టిఎన్టియుసి సింగరేణి కాంగ్రెస్ వర్కర్స్ లేబర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణిరాం సింగ్ వెల్లడించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని టిఎన్టియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన గురువారం నాడు మాట్లాడుతూ మారు పేర్లతో విధులు నిర్వహించి మెడికల్ అన్ ఫిట్ అయిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు కల్పించేలా యాజమాన్యం చొరవ చూపాలంటూ కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు చేస్తున్న ధర్నాకు సంపూర్ణ మద్దతును టిఎన్టియుసి సింగరేణి కాలరీస్ లేబర్ వర్కర్స్ యూనియన్ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని వెల్లడించారు. కార్మికులు గత 35 సంవత్సరాల సర్వీసు చేసి వారి పిల్లలకు ఉద్యోగం కల్పించాలని ఆశతో ఎదురుచూసి అలిసిపోయారనీ, డిపెండెంట్ కార్మికుల పిల్లలు కూడా గత 12 సంవత్సరాల నుండి సింగరేణి యజమాన్యం మారుపేర్ల సమస్యకు పరిష్కారం చూపునందున యజమాన్యం సింగరేణిలో గతంలో గెలిచిన గుర్తింపు ప్రాతినిధ్య కార్మిక సంఘాల చుట్టూ నేడు గెలిచిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు సమస్యను పరిష్కరిస్తామని ప్రకటించి అమలుకు నోచుకోకపోగా కార్మిక సంఘాల చుట్టూ సింగరేణి యాజమాన్యం చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర కార్మిక శాఖ మహత్యులు కిషన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మహత్యులు వివేక్ వెంకటస్వామి స్పందించి గతంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. మారుపేరుల సమస్య పరిష్కరించకపోయిన కారణంగా కుల పిల్లలు కొంతమంది మృతి చెందడం సైతం జరిగిందని వారికి యాజమాన్యం నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశాన్ని సైతం కల్పించాలన్నారు .

కొత్తగూడెం ప్రధాన కార్యాలయం ముందు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు మారుపేరుల సమస్య పరిష్కారం అయ్యేంతవరకు వాళ్ల పక్షాన పోరాటం చేస్తుందని వెల్లడించారు.ఉపాధ్యక్షులుగద్దెల నారాయణ ఓ జిల్లా నాయకులు జీవరత్నం, కల్లుగీతా కార్మిక సంఘం నాయకులు గంగాధర్ గౌడ్,నాయకులు బొల్లు మల్లయ్య, ఎస్ ఎస్ పాండే,కుమార్,ఎండి అజ్గర్ పాషా, వెంకటేశం పి యాదగిరి, పుల్లూరి భూషణ్, మాసాడి గోపాల్ లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల అమలుపై మండల ప్రజా పరిషత్ సమావేశం

**పాలకుర్తి ఆగస్టు 13 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి పాలకుర్తి మండల కేంద్రంలో గురువారం మండల ప్రజా పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ హాజరయ్యారు.మండలంలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. మండల అభివృద్ధికి అవసరమైన చర్యలను వేగవంతం చేయడంతో పాటు ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ పరిష్కరించాలని అధికారులను కోరారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ ,ఎంపీడీవో రమేష్ ,ఎంపీవో, సుదర్శన్ , పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డు మెంబర్లు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# శ్రీదత్త కళాశాలలో ఘనంగా ఓరియెంటేషన్ డే...

- విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలి
- శ్రీ దత్త ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ జి పాండురంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 13 మహా:** శ్రీదత్త ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా ఓరియెంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల చైర్మన్ జి పాండురంగా రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడలోని శ్రీదత్త ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు విద్యా ప్రస్థానానికి సన్నద్ధం చేయడం, కళాశాల విద్య విదానాలు, నిబంధనలు మౌలిక సదుపాయాలు, భవిష్యత్తు అవకాశాలపై అవగాహన కల్పించడం కోసం ప్రథమ సంవత్సరం ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని శ్రీదత్త కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ యొక్క సమావేశంలో కళాశాల చైర్మన్ జి పాండురంగారెడ్డి, ముఖ్య అతిథి స్ట్రింగ్ మేటా వర్స ఇండియా సీఈఓ డాక్టర్ రాఘవేంద్ర ప్రణేష్, విశిష్ట అతిథిగా అజిత్ అనంత్, వైస్ చైర్మన్ విభవరెడ్డి, విద్యా సంస్థల చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ దేవేంద్ర విక్రం రెడ్డి, కళాశాల డీన్ డాక్టర్ వెంకట అచ్యుతరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జి పాండురంగారెడ్డి మాట్లాడుతూ... ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ నాయకత్వ లక్షణాలు సమస్య పరిష్కార నైపుణ్యాలు, నైతిక విలువలు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ యొక్క సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్ట్రింగ్ మేటా వర్స ఇండియా సీఈఓ డాక్టర్ రాఘవేంద్ర ప్రణేష్, ప్రసంగిస్తూ విద్యార్థులు తరగతి విద్యతో పాటు పరిశోధన ప్రాజెక్టులు ఇంటర్నెట్ షిప్ నూతన ఆవిష్కరణలు పరిశ్రమలతో అనుసంధానం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, ఫ్యాకల్టీని అనుసరిస్తూ వారు చెప్పిన విధంగా నడుచుకోవాలని విద్యార్థులకు తెలిపారు. విశిష్ట అతిథిగా అజిత్ అనంత్ మాట్లాడుతూ... కంపెనీగా ఇంజనీరింగ్ విద్యా అనేది కేవలం ఒక డిగ్రీ సాధించడం మాత్రమే కాదు, జ్ఞానం, నైపుణ్యం సృజనాత్మకత క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునే గొప్ప ప్రయాణం ఈ రోజు మీ జీవితంలో ఒక కొత్త అధ్యాయానికి ప్రారంభమని విద్యార్థులకు వివరించారు. శ్రీ దత్త విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ జి ఎన్ వి విభవ్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మొదటి సంవత్సరం నుంచి మీ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకొని ప్రతిరోజు ఒక కొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రయత్నించాలని, తరగతి గదిలో విద్యతో పాటు, ప్రాక్టికల్ నాలెడ్జ్, కోడింగ్ క్లాసులు, టెక్నాలజీ అనుసంధాన స్కిల్స్, పరిశోధనలపై ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. విద్యాసంస్థల చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ దేవేంద్ర విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం మంచి మార్కులు సాధించడం సరికాదు సమస్యలు పరిష్కరించే సామర్థ్యం టీం వర్క్ టైం మేనేజ్మెంట్ నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు ఎంతో అవసరం మీ తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతోపాటు, మీ అధ్యాపకులు అందించే మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కళాశాలలో లభించే ప్రతి అవకాశాన్ని భవిష్యత్తులో అభివృద్ధికి ఉపయోగపడుతుందని ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కోసం వివిధ అవగహన కార్యక్రమాలు సంస్కృతిక ప్రదర్శనలు పరిచయు కార్యక్రమాలను నిర్వహించారు. కొత్త విద్య సంవత్సరాన్ని ఉత్సహంగా ప్రారంభించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఎగ్జామ్ డాక్టర్ వెంకట ప్రసాద్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఎం సెంథిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మారు పేర్ల సమస్యను పరిష్కరించండి

**ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి యాజమాన్యం వెంటనే సింగరేణి కార్మికుల (అలియాస్ ) పేర్ల మార్పు ప్రక్రియను ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు సుదీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న తమ తండ్రుల ఉద్యోగంలో పేర్ల మార్పు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కుటుంబాలు గురువారం చేపట్టిన దీక్ష శిబిరాన్ని ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తన బృందంతో వెళ్లి సందర్శించి దీక్షలు చేస్తున్న సోదరులకు పూలమాలలు వేసి తమ సంపూర్ణ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి మూలధనాన్ని అందించే సింగరేణి సంస్థలో తమ చెమట రక్తాన్ని ధారాబోసి ఉత్పత్తిని పెంచి ఎన్నో లాభాలను అందిస్తున్న సింగరేణి కార్మికుల కుటుంబాలు సంక్షేమంతో సంతోషంగా ఉంటేనే సింగరేణి సంస్థ యొక్క పరువు ప్రతిష్టలు అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక శ్రద్ధ తీసుకొని యాజమాన్యంతో చర్చలు జరిపి ఈ పేర్ల మార్పు సమస్యను వెంటనే పరిష్కరించి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగించాలని లేనిచో ఉద్యమాన్ని ఉధృతం చేసి భావ సార్వ్యత కలిగిన అన్ని సంఘాలను కలుపుకొని వారికి సంఘీభావంగా సమస్య పరిష్కరించేంతవరకు కూడా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు సంఘ నాయకులు టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు సురేందర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు భూపతి అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు మచ్చా పృథ్వీరాజ్, జిల్లా కార్యదర్శి ఎనిగంట శ్రీనివాస్, బెస్ట్ సోషల్ ఆర్గనైజర్ అన్వర్ భాయ్ ,సాయికుమార్, దీక్ష చేస్తున్న ఉద్యమ నాయకులు అధ్యక్షులు శ్రావణ్ గౌడ్, దన్నడ్ రాజు, హరీష్, రాజేష్, అన్వేష్, అద్దంకి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.




# సేవా కార్యక్రమాలతో రేణుక చౌదరి జన్మదిన వేడుకలు

- విద్యార్థులు, ప్రత్యేక చిన్నారులు, వృద్ధులకు అన్నదానం..
- రక్తదాన శిబిరంలో యువత ఉత్సాహం

**మణుగూరు, మహా :** మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి జన్మదిన వేడుకలను గురువారం మణుగూరులో సేవా కార్యక్రమాల నడుమ ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు గురిజాల గోపి ఆధ్వర్యంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మణుగూరు సంతోష్నగర్లోని శ్రీ విద్యాభ్యాస ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్లో విద్యార్థుల సమక్షంలో గురిజాల గోపి, మహిళా మండలి సభ్యులు, కాంగ్రెస్ సీనియర్, యువజన నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. సంతోష్నగర్లోని శ్రీ సత్యసాయి ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల పాఠశాలలో చిన్నారులకు అన్నదానం చేశారు. ఉడతనేని నగర్లోని అమ్మ నాన్న వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు భోజనం అందించారు.

**- ప్రజాసేవలో ముందుకు సాగాలి : గురిజాల గోపి..**

ఈ సందర్భంగా గురిజాల గోపి మాట్లాడుతూ రేణుక చౌదరి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, ఆరోగ్యం ఆమెకు లభించాలని కోరుకున్నానన్నారు. ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు మాట్లాడుతూ రేణుక చౌదరి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ఆమె జన్మదినాన్ని సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు, వృద్ధులతో వేడుకలు పంచుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. నిరుపేదలు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

**రక్తదానంతో సేవా స్ఫూర్తి..**

రేణుక చౌదరి జన్మదినాన్ని పురస్కరించుకుని మణుగూరులోని ఆమె క్యాంపు కార్యాలయంలో రెడ్క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గురిజాల గోపి అధ్యక్షతన, యువజన నాయకులు గురిజాల సందీప్, గురిజాల సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో రక్తదానం చేసినట్లు యువకులు తెలిపారు. రక్తదాతలకు రెడ్క్రాస్ ప్రతినిధులు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమాల్లో రేణుక అక్షర మహిళా మండలి ఉపాధ్యక్షురాలు బొడ్డు సౌజన్య, ట్రెజరర్ ఎండీ షబానా, కోరి శ్యామల, దేరంగుల సుజాత, కన్నపురం వసంత, బాడిశ పార్వతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ షరీఫ్, వెంకటాచారి, మాధవరెడ్డి, యువజన నాయకులు గురిజాల సందీప్, గురిజాల సాయి కిషన్ నాయక్, హేమంత్, సనిల్, రాము, శివతో పాటు రెడ్క్రాస్ సొసైటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సంక్షేమానికే ప్రథమ పీఠం

- పలు అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, పుల్కం.రాజు



**వేములవాడ, మహా:** ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీటనిస్తుందని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు.ఈ సందర్భంగా గురువారం వేములవాడ పట్టణంలో 4.20 కోట్లతో ప్రారంభమైన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు అత్యంత పారదర్శకంగా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరగాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ఆదేశించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే పట్టణంలోని 12, 13, 15, 25వ వార్డులలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కౌన్సిలర్లు , మున్సిపల్ కమిషనర్, అధికారులతో ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.పనుల పురోగతిని,నిర్మాణ నాణ్యతను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో పట్టణ ప్రజలకు డ్రైనేజీ, రోడ్ల పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.పలు వార్డుల్లో చాలాకాలంగా సరైన డ్రైనేజీ వ్యవస్థ,సీసీ రోడ్లు లేక వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు, వాహనదారులు పడుతున్న అవస్థలను స్వయంగా గుర్తించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం ద్వారా రూ. 4.20 కోట్ల నిధులను మంజూరు చేయించి,పట్టణ సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేద ప్రజల పక్షపాతిగా నిలుస్తుందని, సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని కొనియాడారు. కేవలం పథకాలకే పరిమితం కాకుండా, ప్రజల రోజువారీ జీవన ప్రమాణాలను పెంచే మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.పట్టణంలోని ప్రతి వార్డునూ మోడల్ వార్డుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉన్నామని, ఎక్కడా నిధుల కొరత లేకుండా చూస్తున్నామని చెప్పారు. కాంట్రాక్టర్లు పనుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని, నిర్ణీత గడువులోగా నాణ్యతతో కూడిన నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పట్టణంలో జరుగుతున్న ఈ బృహత్తర అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు కూడా భాగస్వాములై, పనుల పర్యవేక్షణలో సహాయపడుతూ మున్సిపల్ పాలకవర్గానికి, యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, వార్డు కౌన్సిలర్లు కొక్కుల బాలకృష్ణ, మూడపల్లి నీలమ్మ, ఏఈ అనన్య, టిపో అన్వేష్, సిబ్బంది, నాయకులు, స్థానిక కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# డిపిఆర్ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తాం

- విమర్శల నివృత్తికే ఆన్లైన్ టెండర్లకు ఆదేశం
- రూ.9.60 కోట్ల అవినీతి ప్రచారం అబద్ధం
- అబద్ధపు ప్రచారంతో ప్రజల్లో అనుమానాలు సృష్టించొద్దు
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** డిపిఆర్ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిధులు మంజూరు కానున్నాయని పనుల అంచనాల ప్రకారమే కేంద్ర గ్రాంట్లు, రాష్ట్ర వాటా బ్యాంకుల రుణాల ద్వారా నిధుల సమీకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా లక్ష కోట్ల కేంద్ర సహాయంతోపాటు 25 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రం, 50 శాతం బ్యాంకు రుణం ఉంటుందని ఇందులో భాగమైన 26 మున్సిపాలిటీల్లో ఖమ్మం కార్పొరేషన్కు రూ.2,670 కోట్ల రుణం వస్తుండగా కొత్తగూడెం కార్పొరేషన్కు రూ.600 కోట్ల రుణం అడిగామని వివరించారు. అభివృద్ధి పనుల నిధులపై కాకుండా కేవలం 'వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక టెండర్'కు సంబంధించి కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కూనంనేని మండిపడ్డారు. రూ.600 కోట్ల అంచనా పనులకు 1.6 శాతం చొప్పున డిపిఆర్ టెండర్ ఒప్పందం కుదిరితే అందులో ఏకంగా రూ.9.60 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో నల్గొండలో 1.6 శాతం, మహబూబ్నగర్లో రూ.1,000 కోట్ల పనులకు 1.5 శాతంతో ఇలాగే డిపిఆర్ ఒప్పందాలు కుదిరాయని గుర్తుచేశారు. ఇతర పట్టణాలు, మున్సిపాలిటీల్లోనూ ఇదే విధానంలో టెండర్లు జారీ అయినప్పుడు లేని అవినీతి కేవలం కొత్తగూడెంలోనే ఎలా జరుగుతుందని అక్కడ కూడా అవినీతి జరిగినట్లేనా అని నిలదీశారు. ఆరు నెలల పసిపిల్ల లాంటి కొత్తగూడెం కార్పొరేషన్ను పురిటిలోనే చంపాలని కుట్రలు చేస్తున్నారని అసలు నిధులే విడుదల కాకుండా డిపిఆర్ ఫీజులో కోట్ల రూపాయల అవినీతి ఎలా జరుగుతుందో చెప్పాలన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో అపోహలు సృష్టించారని ప్రజల్లో ఉన్న సందేహాలు అపోహలను నివృత్తి చేయడానికి ఆఫ్లైన్ డిపిఆర్ విధానాన్ని రద్దు చేసి ఆన్లైన్ టెండర్లకు ఆదేశాలు ఇచ్చామని స్పష్టం చేశారు. డిపిఆర్ శాతాన్ని 0.5 శాతానికి లేదా మరింత తగ్గించే సామర్థ్యం ఉన్నవారు ఆన్లైన్ టెండర్లలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. చుంచుపల్లి ఉమ్మడి పంచాయతీ 45 ఏళ్లుగా సీపీఐ అధీనంలోనే ఉందని ప్రజాదరణ లేకపోతే తాము ఎన్నికల్లో గెలుస్తామా అని ప్రశ్నించారు. గతంలో ప్రపంచ బ్యాంకు రుణం (టీఎండీపీ) విధానాన్ని వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు లేదా అధికారులు ఎవరైనా తప్పులకు పాల్పడినా పేదలను మోసం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని, అనవసర ఆరోపణలు చేస్తే వెంటాడతామని హెచ్చరించారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యా సంస్థలు, క్రీడా ప్రాంగణాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన వివరించారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు ఎండి యూసుఫ్, మునిగడప వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరావు, మునిగడప పద్మ, బోయిన విజయ్ కుమార్, గడ్డం శాంతిప్రియ, గడ్డం వెంకటేశ్వరావు, నామా కీర్తి, కూరపాటి సుధాకర్, బండి నర్సింహా, ధనలక్ష్మి, దుర్గయ్య, కళావతి, శ్యామల, మంద నాగమణి, మద్దాల హరిత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

- డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

**ఘట్కేసర్, మహా :** ఘట్కేసర్ 6వ డివిజన్లో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శివారెడ్డిగూడలోని బంధన్ ఫంక్షన్హాల్లో గురువారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "పదవుల కంటే పార్టీ, ప్రజలే ముఖ్యం. ప్రతి కార్యకర్త ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలి. నూతన కమిటీలో పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికి ప్రాధాన్యం ఉండాలి" అని సూచించారు. డివిజన్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ను మరింత పటిష్ఠం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నూతన డివిజన్ కమిటీ ఏర్పాటులో భాగంగా పేర్ల సేకరణ చేపట్టగా, ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి కృషి చేసిన బీఎల్ఏలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్చంద్రారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మార్కెట్ కమిటీ సభ్యుడు మచెందర్రెడ్డి, మాజీ సర్పంచ్ మేడబోయిన వెంకటేష్ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ సగ్గు అనితతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**కారేపల్లి, మహ :** కారేపల్లి మండలం విశ్వనాథపల్లి లో ఇటీవల విద్యుద్ఘాతానికి గురై మృతి చెందిన మహిళ రైతు వడ్డే ఉమా కుటుంబాన్ని గురువారం వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి పరామర్శించారు. వడ్డే ఉమా సంస్మరణ కార్యక్రమానికి హాజరైన ఆమె ఉమా చిత్రటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మృతురాలి భర్త రమేష్, ఇద్దరు కూతుళ్లకు ధైర్యం చెప్పి ఓదార్చారు. తల్లి ఉమా మీపై పెట్టుకున్న ఆశలను సాకారం చేసి ఆమె ఆత్మకు శాంతిని కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు జిల్లా యువజన నాయకులు ముత్యాల వెంకట అప్పారావు, నాయకులు తాత వెంకటేశ్వర్లు,తాత ఉపేందర్, సురపురెడ్డి రవీందర్ రెడ్డి, చాగంటి కోటయ్య, తమ్మిని ముత్తయ్య, దొంతు దాసు, వడ్డే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మార్పు కోసమే చైతన్య యాత్రలు

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

భద్రాద్రి కొత్తగూడెం, మహా: సిపిఐ జాతీయ కమిటీ పిలుపుమేరకు 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో ఈనెల 6 నుంచి వారం రోజులపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం నుంచి అశ్వారావుపేట వరకు చేపట్టిన జన చైతన్య యాత్రలు జిల్లా వ్యాప్తంగా అత్యంత విజయవంతమయ్యాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా తెలిపారు. గురువారం శేషగిరిభవన్'లో అయన మాట్లాడుతూ జిల్లాలోని 23 మండలాల పరిధిలో ఈ నెల 6వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఈ ప్రచార యాత్రలు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగాయని ఆయన పేర్కొన్నారు. ఈ యాత్రల్లో భాగంగా వివిధ గ్రామాలు, మండల కేంద్రాలలో మొత్తం 158 బహిరంగ సభలను నిర్వహించామని, 460 గ్రామాలు బస్తీల మీదుగా పాదయాత్రలు ప్రచార కార్యక్రమాలు కొనసాగాయని వెల్లడించారు. వందమంది పార్టీ నాయకులు ప్రజా సంఘాల నాయకులు యాత్ర బృందంగా పాల్గొని జయప్రదం చేశారని తెలిపారు. ఈ యాత్రల ద్వారా సుమారు మూడు లక్షల మంది ప్రజలను నేరుగా కలసి యాత్ర యొక్క ముఖ్య ఉద్దేశాలను, ప్రజా సమస్యలపై పార్టీ పోరాట పంథాను వివరించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. దేశంలో పెరిగిపోతున్న ధరలు, నిరుద్యోగం, రాజ్యాంగ బద్ధ సంస్థల నిర్వీర్యం వంటి చర్యలకు నిరసనగా ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి, ప్రజల హక్కు సాధనకు నిరంతరం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. యాత్రల స్ఫూర్తితో సెప్టెంబర్ 1న ఢిల్లీ రాం లీలా మైదానంలో జరిగే జాతీయ స్థాయి ధర్నా, బహిరంగ సభకు తరలుతామని స్పష్టం చేశారు.



# డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో నివాసం తప్పనిసరిగా ఉండాలి

**ప్రాజెక్ట్ డైరెక్టర్ బన్సీలాల్.**

క్యాతనపల్లి మహా : నిరుపేదలకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో లబ్ధిదారులు తప్పనిసరిగా నివాసం ఉండాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బన్సీలాల్ సూచించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో పేదలకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ఇండ్లను కేటాయించి సంవత్సరం గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు చాలామంది ఇండ్లలో నివాసం ఉండడం లేదని ఇప్పటికే నోటీసులు అందజేశామని పేర్కొన్నారు. ఎవరైతే నోటీసులు అందుకున్న వారు ఈనెల 25వ తేదీలోపు ఖచ్చితంగా గృహంలో ఉండాలని, లేని పక్షంలో ఇంటి పట్టా రద్దుచేసి అర్హులైన ఇతర పేదల కుటుంబాలకు అట్టి ఇండ్లను కేటాయించడం జరుగుతుందని హెచ్చరించారు. ఇదే చివరి అవకాశంగా భావించి ప్రతి ఒక్కరూ గృహ ప్రవేశం చేయవలసిందిగా కోరారు. ఆయన వెంట ఏఈ సాయిరాం, లబ్ధిదారులు దండు సదానందం, బీసా శ్రీనివాస్, ఎల్కటూరి నరేష్, అనంతుల రవి ఉన్నారు.

# బాలికపై అఘాయిత్యం.. నిందితుడి అరెస్ట్, రిమాండ్

**మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు**

**వరంగల్, క్రైమ్ మహా ;**

వరంగల్ తేదీ 13 8 2026 మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలిక పై పలు మార్లు లైంగిక దాడికి పాల్పడి, ఆ బాలికను గర్భవతిని చేసిన కేసులో గురువారం నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి విచారణ అనంతరం రిమాండ్ కు తరలించారు. బాధితురాలి రక్షణ అలాగే సున్నితత్వాన్ని పరిగణనలోనికి తీసుకుని వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి.

**కేసు వివరాల్లోకెళ్తే..**

బాధితురాలి తల్లి ఓ ప్రైవేట్ రంగంలో స్వీపర్గా పనిచేస్తోంది. భర్త వ్యసనాలకు బానిస కావడంతో, ఆమె తన ముగ్గురు కుమార్తెలతో కలిసి ఒక వ్యక్తితో సహజీవనం సాగిస్తోంది. సదరు వ్యక్తి ఆ కుటుంబ సంరక్షణ చూస్తూ, పిల్లల చదువు బాధ్యతలను కూడా తీసుకున్నాడు.ఈ క్రమంలో, సుమారు మూడేళ్ల క్రితం బాధితురాలిని ఒక బాలికల వసతి గృహంలో చేర్పించారు. కాగా 2025 జూన్ నెలలో నిందితుడు తల్లికి తెలియకుండా సదరు వసతి గృహానికి వెళ్లి, బాలికకు తినుబండారాలు కొనిచ్చి, బైక్ పై తన గదికి తీసుకువేళ్లే వాడు. అక్కడ బాలిక పై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే కుటుంబం మొత్తాన్ని చంపేస్తానని బెదిరించాడు. భయాందోళనకు గురైన బాలిక ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. నిందితుడు అదే విధంగా వసతి గృహం నుండి బాలికను పలుమార్లు తీసుకువచ్చి లైంగిక దాడిని కొనసాగించాడు.ఇటీవల బాలిక అనారోగ్యానికి గురై, కడుపు నొప్పితో బాధపడుతుండటాన్ని గమనించిన తల్లి గట్టిగా నిలదీయగా, నిందితుడు చేసిన అకృత్యాన్ని బాలిక వివరించింది. వెంటనే పరీక్షలు నిర్వహించగా బాలిక గర్భం దాల్చినట్లు నిర్ధారణ అయింది. దీనితో బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడి వివరాలను పోలీసులు వెల్లడిస్తూపేరు: సంగాల విజయ్ కుమార్ (38), వృత్తి: ఆటో డ్రైవర్ , చట్టపరమైన సెక్షన్లు అండర్ యు/ఎస్ సెక్షన్ 65(1), 64(2)(ఎమ్), 64(2)(ఎఫ్), 351(2) బిఎన్ఎస్ సెక్షన్ 5(l), 5(n) ఆర్/డబ్ల్యూ 6 పోక్సో చట్టం2012 ప్రకారం

**పోలీసులు కేసు నమోదు చేసి**

బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా మట్వాడ పోలీసులు కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. భరోసా కేంద్రం ద్వారా బాధితురాలి ప్రకటనను వీడియో రికార్డింగ్ ద్వారా నమోదు చేసి, వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులువాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడు సంగాల విజయ్ కుమార్ను పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. నేరానికి ఉపయోగించిన పల్సర్ మోటార్ సైకిల్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం న్యాయస్థానం ముందు హాజరు పరుచగా 15 రోజుల జుడీషియల్ రిమాండ్ విధించింది. పోలీసుల ముఖ్య గమనిక ఏమిటంటే చట్టప్రకారం, బాధితురాలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధితురాలి, ఆమె కుటుంబ సభ్యుల వివరాలు నివాస ప్రాంతాల పేర్లు గోప్యంగా ఉంచడం జరిగిందని మట్వాడ ఇన్స్పెక్టర్ తెలిపారు.



# ఉత్పత్తి లక్ష్యాల సాధనకు పకడ్బందీ ప్రణాళిక

**సత్తుపల్లి, ఆగస్టు 13: మహా :** సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు సత్తుపల్లి ఏరియాలో గురువారం విస్తృతంగా పర్యటించారు. ఏరియాలోని బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, ఉత్పాదకతపై అధికారులతో సమీక్ష నిర్వహించి, నిర్దేశిత వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముందుగా సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం ఎస్. వెంకటచారి సమక్షంలో అన్ని గనుల విభాగాల అధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొగ్గు నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకతపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనను ప్రధాన ప్రాధాన్యంగా తీసుకుని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కిష్టారం ఓపెన్కాస్ట్, జేవీఆర్ ఓపెన్కాస్ట్ గనులను సందర్శించారు. రూ.6 కోట్లకు పైగా విలువైన 6.4 క్యూబిక్ మీటర్ల బకెట్ సామర్థ్యం కలిగిన నూతన కోమట్సు లోడర్లను ప్రారంభించారు. యంత్రాల వినియోగంతో ఉత్పత్తి, ఉత్పాదకత మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం జేవీఆర్ ఓపెన్కాస్ట్ గని వీక్షణ కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. గని కార్యకలాపాలపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. ఈ పర్యటనలో సత్తుపల్లి ఏరియా అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

# సమస్యలపై ఉద్యమం ఉధృతం చేస్తాం

**సమస్యలపై తహసీల్దార్ కు యూఎస్పీసీ వినతి**

**కారేపల్లి, మహా:** ఉపాధ్యాయ, విద్యారంగ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) హెచ్చరించింది. గురువారం యూఎస్పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ధశలవారి పోరాటాల పిలుపులో భాగంగా తహసీల్ధార్ ఓరుగంటి వెంకటేశ్వర్లుకు సమస్యలతోకూడిన వినతి ప్రతాన్ని అందజేశారు. ఈసందర్భంగా యూఎస్పీసీ నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ గడువు ముగిసి మూడు ఏండ్లు గడిచినా నూతన పీఆర్సీని అమలు చేయకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల చిన్న చూపే అని అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 6 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన రూ. కోట్లాది బిల్లులు పెరుకపోయి ఉన్నాయని తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. సమస్యలపై ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 29న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే సెప్టెంబర్ మొదటి వారంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ సింగరేణి మండల నాయకులు కేవీ కృష్ణారావు, బానోత్ మంగీలాల్, గురుమూర్తి, మల్లేశ్వరరావు, బన్సీలాల్, ఈరు నాయక్, భూక్య రాంకోటి, యూటీఎఫ్ మండల ఉపాధ్యక్షులు నాగలక్ష్మి,నాగేశ్వరరావు, కోశాధికారి, ఎఫ్ బ్ల్యూఎఫ్ కన్వీనర్ నాగేశ్వరావు, కార్యదర్శులు రామకృష్ణ, సంతులాల్,రామారావు, శివకోటి, బాలకృష్ణ, లకుపతి, భాస్కరరావు, శ్రీలత, సునీత, అప్పారావు, వీ. శ్రీనివాసరావు, రాజారావు, చిన్నారాములు, సోమ్లా, శ్యామ్ ప్రసాద్, మురళీ, కిషన్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలి

- **నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ**
- **సీతారామ ప్రాజెక్టు పనులపై సుదీర్ఘ చర్చ**
- **జూలూరుపాడు టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి**
- **సాగర్ ఆయకట్టు పంటలకు మరోసారి నీటిని విడుదల చేయాలి**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సీతారామ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని మూడో నుంచి నాలుగో పంప్ హౌస్ మధ్యలో 532 ఎకరాల భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేసి జూలూరుపాడు టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటుగా సాగర్ ఆయకట్టు పంటలకు మరోసారి నీటిని విడుదల చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సీతారామ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం భేటీ అయ్యారు. సీతారామ ప్రాజెక్టుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలు, ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరువురు మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల కోరారు.

రూ.45 కోట్లతో 532 ఎకరాల భూసేకరణను త్వరగా పూర్తి చేయాలి...మూడో పంప్‌హౌస్ నుంచి నాలుగో పంప్‌హౌస్ వరకు నీటిని తరలించేందుకు అవసరమైన 532 ఎకరాల భూసేకరణ ప్రక్రియను రూ.45 కోట్లతో చేపట్టినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల పరిధిలో ఈ భూసేకరణ పూర్తయితే ఆయా ప్రాంతాలకు గోదావరి జలాలు అందుతాయని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు.

**సంబంధిత పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలి**

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతుల భూములన్ని సస్యశ్యామలం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆయకట్టు రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూ సేకరణ, పైప్ లైన్ నిర్మాణం పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ములకలపల్లి మండలం కమలాపురంలోని మూడో పంప్‌హౌస్ నుంచి దమ్మపేట మండలంలోని నాలుగో పంప్‌హౌస్ వరకు కాలువ ద్వారా నీటిని తరలించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. అయితే నాలుగో పంప్‌హౌస్ నుంచి దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని చెరువులకు గోదావరి జలాలను కాలువల ద్వారా అందించే ప్రతిపాదనలకు బదులుగా పైప్‌లైన్ ద్వారా నీటిని అందించేలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. పైప్‌లైన్ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి నిధులు విడుదల చేసి పనులను చేపడితే భూసేకరణ వ్యయం తగ్గడంతో పాటు రైతులు తమ భూములను కోల్పోవాల్సిన అవసరం ఉండదని మంత్రి తుమ్మల వివరించారు.

జూలూరుపాడు టన్నెల్ పనులు వేగవంతం చేయండి...జూలూరుపాడు టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు జలాశయానికి నీటిని అందించాలని మంత్రి తుమ్మల కోరారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని వైరా, లంకసాగర్ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇటీవల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కొనసాగితే ఆయకట్టు పరిధిలోని పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతుల పంటలను రక్షించేందుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా మరోసారి సాగునీటిని విడుదల చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెండు మూడు రోజుల్లో సాగర్ ఆయకట్టు పంటలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పైప్‌లైన్, టన్నెల్ తదితర పనులను వేగవంతం చేసి రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల తెలిపారు.



# శ్రీ కాలభైరవ స్వామిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖమురళీధర్ రావు దంపతులు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సుస్మితా పటేల్ -అభిలాష్ దంపతులు**

**వరంగల్, బ్యూరో మహా;** హైదరాబాదులోని నాంపల్లి దేవిబాగ్ లోని ప్రముఖ ప్రసిద్ధిగాంచిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయాన్ని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కొండా మురళీధర్ రావు దంపతులు, కుమార్తె సుస్మితా పటేల్, అల్లుడు అభిలాష్ పటేల్‌లతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులంతా కలిసి కాలభైరవ స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలభైరవ స్వామికి కాలాన్ని నియంత్రించే దైవస్వరూపంగా హిందూ సంప్రదాయంలో విశిష్టమైన స్థానమున్నదని మంత్రి సురేఖ అన్నారు. పరమశివుని ఉగ్రరూపంగా, క్షేత్రపాలకుడిగా, ధర్మ పరిరక్షకుడిగా భక్తులు కాలభైరవున్ని కొలుస్తారని తెలిపారు. కాలభైరవ స్వామిని ఆరాధించడం ద్వారా భయాలు తొలగి, ధైర్యం, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక బలం చేకూరుతాయని భక్తుల విశ్వాసమని వెల్లడించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాలభైరవ స్వామిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. ఆలయాల ఆధ్యాత్మిక వైభవాన్ని, పురాతన సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రి సురేఖ తో పాటు, వారి కుటుంబ సభ్యులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు అందించారు.

# ఆరుట్ల పాఠశాలలో ఫుడ్ కమిషన్ తనిఖీలు..!

- **ఆహార నాణ్యతలో నిర్లక్ష్యం వహించరాదు**
- **విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి**
- **పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్ కు సూచన**
- **ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 13 మహా:** ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలను ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కమిషన్ సభ్యులు సందర్శించారు. గురువారం మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలోని టిపిఎస్ పాఠశాలలో ఫుడ్ కమిషన్ ఛైర్మన్, కమిషన్ సభ్యులు, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, వంటగది, డైనింగ్ హాల్ను పరిశీలించారు. మెనూ ప్రకారం టిఫిన్, భోజనం అందించాలని, మెనూ బోర్డులో వివరాలు నమోదు చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులకు అందించే ఆహారంలో అవకతవకలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహార నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహించరాదని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్ గౌడ్ కు ఆయన సూచించారు.

# ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలి

- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలని తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలు కూరగాయల సాగును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సుజాతనగర్ మండలం సింగభూపాలెం, వేపలగడ్డ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం విస్తృతంగా పర్యటించి వివిధ అభివృద్ధి సంక్షేమ విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగభూపాలెం చెరువును సందర్శించిన కలెక్టర్ నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించారు. చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం 19 అడుగులు కాగా ప్రస్తుతం 14.5 అడుగుల నీరు ఉన్నట్లు అధికారులు వివరించారు. ఈ చెరువు ద్వారా సుమారు 2,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని సూచించారు. పెసర కూరగాయల సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాత అంజనాపురం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయ పంటలు పెసర పత్తి పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కాకరకాయ సొరకాయ తదితర కూరగాయల సాగును పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. ఎల్ నినో ప్రభావం వర్షాభావ పరిస్థితులు వాటి ప్రభావం పంటల సాగుపై పడే అవకాశం తదితర అంశాలను రైతులకు వివరించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగు చేపట్టకుండా తక్కువ నీటితో సాగు చేయగల పెసర వంటి ఆరుతడి పంటలతో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటలను చేపట్టాలని సూచించారు. సింగభూపాలెం గ్రామంలో సుమారు 600 ఎకరాల్లో కూరగాయలు, 300 ఎకరాల్లో పెసర సాగు జరుగుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులకు తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని తాగునీటి అవసరాలను కాపాడుతూ వున్న నీటిని పొదుపు చెయ్యాలన్నారు. అనంతరం సింగభూపాలెం గ్రామంలో మొదటి దశలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులతో పాటు రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపడుతున్న సర్వేను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదటి దశలో గ్రామానికి మొత్తం 32 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 100 శాతం ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తయిందని 11 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. నిర్మాణం పూర్తయిన లబ్ధిదారు మిరియాల అరుణ ఇంటిని పరిశీలించిన కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కోసం జరుగుతున్న సర్వేను పరిశీలించారు. దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి వారి యొక్క ఆర్థిక పరిస్థితి కుటుంబ పరిస్థితి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 220 దరఖాస్తులు అందగా ఇప్పటి వరకు 92 దరఖాస్తుల సర్వే పూర్తయిందని ఇందులో 61 పూరి గుడిసెలకు సంబంధించిన సర్వే పూర్తయిందని అధికారులు వివరించారు. మొత్తం దరఖాస్తుల్లో 10 దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తుల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేలో పూర్తి పారదర్శకత పాటిస్తూ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు రెండో విడత ఇందిరమ్మ ఇంటి పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ అంకిత్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్ బాబు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, వ్యవసాయ శాఖ ఏవోలు, ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సర్వే బృందాల సిబ్బంది గ్రామస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గోపాల్ పూర్ చెరువు అంశంపై విచారణ చేపట్టిన విజిలెన్స్

- **టౌన్ ప్లానింగ్ ను చెరువుకు సంబంధించిన కీలక రికార్డులు, అనుమతుల వివరాలను కోరిన విజిలెన్స్**

**వరంగల్, బ్యూరో మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలోని గోపాల్ పూర్ చెరువుకు సంబంధించిన అంశం పై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. విజిలెన్స్ డీజీ ఆదేశాల మేరకు వరంగల్ విజిలెన్స్ అధికారులు బల్దియాలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి చేరుకుని చెరువుకు సంబంధించిన కీలక రికార్డులు, అనుమతుల వివరాలను సేకరిస్తున్నారు. గోపాల్పూర్ చెరువు మొత్తం విస్తీర్ణం ఎంత? చెరువుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ మ్యాప్‌లో హద్దులు ఎలా ఉన్నాయి? చెరువు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇప్పటివరకు ఎన్ని నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు? చెరువు పరిధికి సమీపంలో ఏమైనా నిర్మాణాలకు పర్మిషన్లు మంజూరు చేశారా? అనే అంశాల పై అధికారులు వివరాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా చెరువు పరిధి, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, మాస్టర్ ప్లాన్, లేఅవుట్ అనుమతులు, భవన నిర్మాణ అనుమతులు, సంబంధిత ఫైళ్లు, నోట్ ఫైల్స్, పర్మిషన్ రికార్డులు తదితర పూర్తి డాక్యుమెంట్లను విజిలెన్స్ అధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులను కోరినట్లు తెలుస్తోంది. చెరువు విస్తీర్ణం, హద్దులు, చుట్టుపక్కల ఇచ్చిన అనుమతులు, వాటికి సంబంధించిన నిబంధనలు పాటించారా లేదా అనే అంశాలపై రికార్డుల ఆధారంగా సమగ్రంగా విచారణ కొనసాగనున్నట్లు సమాచారం.



# మృతి చెందిన హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం

**మందమర్రి, మహా :** ఇటీవల మందమర్రి సర్కిల్ రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ లక్ష్మణ్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే తోటి ఉద్యోగులు తలో కొంత వసూలు చేసి మృత కుటుంబానికి 48 వేల రూపాయలు అందజేసి మానవతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్ పోలీస్‌లవలే 24 గంటలు విధులు నిర్వహించిన నష్టపరిహారం లేదని అన్నారు. మా సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి హోంగార్డులను పోలీసులుగా పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. హోంగార్డు వ్యవస్థలో పనిచేస్తున్న ఒక సహచర ఉద్యోగికి కష్టం వస్తే అందరం కలిసికట్టుగా నిలబడడం ఆనందంగా ఉందని అన్నారు. ఆర్థిక సాయం చేసి కుటుంబాన్ని ఆదుకున్న సహచర ఉద్యోగులకు వారు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామగుండం కమిషనరేట్ ఆర్ఐ పెద్దయ్య ఏఆర్ఎస్ఐ రామ్ సింగ్,సురేష్, శ్రావణ్, రాజన్న, సదానందం,తిరుపతి,లక్ష్మణ్,మహేష్ లతో పాటు జిల్లాలో రిజర్ నిర్వహిస్తున్న హోంగార్డులు హాజరయ్యారు.



# వరంగల్‌లో ఘనంగా హర్ ఘర్ తిరంగా

- **మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ**
- **ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు గంట, పాల్గొన్న బిజెపి శ్రేణులు**

**వరంగల్, బ్యూరో మహా :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశభక్తిని చాటి చెప్పేలా శివనగర్ మండల పరిధిలో 'హర్ ఘర్ తిరంగా' భారీ బైక్ ర్యాలీని గురువారం నిర్వహించారు. శివనగర్ మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హాజరై, ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకే ప్రధాని నరేంద్ర మోడీ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. జాతీయ జెండా మన దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు ప్రతీక అని, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశ గౌరవాన్ని చాటాలని ఆయన కోరారు. శివనగర్ మండల పరిధిలోని 34, 35, 36 తో పాటు 27వ డివిజన్ల లోని వీధుల గుండా ఈ బైక్ ర్యాలీ సాగింది. బిజెపి శ్రేణులు, యువత త్రివర్ణ పతాకాలు చేతబూని డివిజన్ల వీధులన్నీ దేశభక్తి నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బైరి శ్యాంసుందర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మదాసు రాజు, మండల నాయకులు వైట్ల గణేష్, తమ్మిశెట్టి క్రాంతి కుమార్, పోశాల సతీష్, సుర శ్రీనివాస్, తాళ్లపెల్లి శ్రీనివాస్, బోడకుంట్ల శివశంకర్, జన్ను ప్రభాకర్, పిట్టల వెంకన్న, మహిళా మోర్చా నాయకురాలు మార్త ఉషారాణి, శెట్టి స్రవంతి, తోట సాగరిక, జిల్లా, మండల, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి పట్టణంలోని రోడ్ల విస్తరణకు మార్గం సుగమం

- **అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణ అభివృద్ధిలో భాగంగా చేపట్టనున్న రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అధ్యక్షతన గురువారం రోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో సింగరేణి జీఎం ఎన్. రాధాకృష్ణ మున్సిపల్ ఛైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, ఏసీపీ కిరణ్ కుమార్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య యకులు పాల్గొన్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బెల్లంపల్లిపట్టణంలో చేపట్టనున్న రోడ్ల విస్తరణ పనులు, సింగరేణి పరిధిలోని విద్యుత్ స్తంభాల (ఎలక్ట్రిక్ పోల్స్) మార్పిడి తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. రోడ్ల విస్తరణకు సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయం చేసుకుంటూ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల పనులను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా,సమర్థవంతంగా పూర్తిచేయాలని సూచించారు.

అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులకు ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.బెల్లంపల్లి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ప్రకటించారు.సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై అధికారులతో సవివరంగా చర్చించి పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు.






# నిరుద్యోగ విద్యార్థులకు ఉపాధి కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి

- **సిపిఎం జిల్లా కార్యదర్శి దుబ్బాక రామచంద్రర్**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్‌లో సీపీఎం పార్టీ , అనుబంధ ప్రజా సంఘాలు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చేవెళ్ల, షాద్‌నగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గాల నాయకులు హాజరయ్యారు. ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కెవై ప్రణయ్ అధ్యక్షత వహించారు. సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి దుబ్బాక రామచందర్ హాజరయ్యారు. సీతారాం ఏచూరి 74వ జయంతి, ఫిడెల్ కాస్ట్రో 100వ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రామచందర్ మాట్లాడుతూ, విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. యువత, విద్యార్థులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ నెల 18న నిర్వహించే దీక్షకు చేవెళ్ల, షాద్‌నగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గాల నుంచి విద్యార్థులు, నిరుద్యోగులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జాజాల రుద్రకుమార్, ప్రజా సంఘాల నాయకులు శ్రీనునాయక్, శేఖర్, శ్రీకాంత్, కృష్ణ, అరుణ్, ప్రశాంత్, కుర్మయ్య, పుల్లారావు, రుద్రాక్ష, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయ అందంలో శ్రీముఖి సందడి

తెలుగు బుల్లితెరపై తనదైన యాంకరింగ్ శైలితో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీముఖి తాజాగా సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిపోయారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా సాగిన తాజా ఫొటోషూట్‌లో ఆమె అద్భుతమైన లుక్‌లో కనిపించి అభిమానులను ఆకట్టుకున్నారు. ఊదా రంగు బ్యాక్‌డ్రాప్‌కు పూలమాలల అలంకరణను జోడించి నిర్వహించిన ఈ ఫొటోషూట్‌లో శ్రీముఖి సంప్రదాయ అందానికి ఆధునిక మెరుపును జోడించారు. ఊదా, బంగారు రంగుల కలయికలో రూపొందించిన పట్టుచీర తరహా సంప్రదాయ దుస్తుల్లో శ్రీముఖి ఎంతో హుందాగా కనిపించారు. దుస్తులపై ఉన్న సున్నితమైన జరీ పనితనం ఆమె లుక్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. అదే రంగులలో రూపొందించిన బ్లౌజ్‌తో పాటు మెరిసే నడుము పట్టీని ధరించి సంప్రదాయ శైలిని మరింత అందంగా ప్రదర్శించారు. మెడలో భారీ ఆభరణాలు, చేతులకు గాజులు, చెవులకు సంప్రదాయ నగలు ధరించడంతో ఆమె రూపం మరింత కళాత్మకంగా కనిపించింది. జుట్టులో పూల అలంకరణ కూడా ఈ లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫొటోషూట్‌లో శ్రీముఖి ఇచ్చిన వివిధ భంగిమలు, చిరునవ్వులు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పండుగల సందర్భంగా సంప్రదాయ దుస్తుల్లో ఎలా కనిపించాలో చెప్పేలా ఆమె తాజా లుక్ ఉందంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. వస్త్రధారణ, ఆభరణాలు, మేకప్, హెయిర్‌స్టైల్ అన్నీ ఒకదానికొకటి సరిపోయేలా ఉండటంతో ఫొటోలు ప్రత్యేకంగా నిలిచాయి.

శ్రీముఖి 1993 మే 10న తెలంగాణలోని నిజామాబాద్‌లో జన్మించారు. తొలినాళ్లలోనే టెలివిజన్ రంగంలో యాంకర్‌గా అడుగుపెట్టి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అదుర్స్, సూపర్ సింగర్ వంటి కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించి ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తన చురుకైన మాటతీరు, హుషారైన యాంకరింగ్‌తో బుల్లితెరపై ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆ తర్వాత సినిమాల్లోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. 2012లో విడుదలైన జులాయి చిత్రంలో అల్లు అర్జున్ సోదరి పాత్రలో నటించి వెండితెరపై పరిచయమయ్యారు. అనంతరం ప్రేమ ఇష్క్ కాదల్ చిత్రంలో ప్రధాన పాత్రలో కనిపించారు. చంద్రిక, జెంటిల్‌మన్, నేను శైలజ, మాస్ట్రో, క్రేజీ అంకుల్స్, భోళా శంకర్ తదితర చిత్రాల్లోనూ వివిధ పాత్రలు పోషించారు. 2019లో ప్రసారమైన బిగ్‌బాస్ తెలుగు మూడో సీజన్‌లో పాల్గొన్న శ్రీముఖి చివరి దశ వరకు పోటీలో కొనసాగి మొదటి రన్నరప్‌గా నిలిచారు. ఈ కార్యక్రమం ఆమెకు మరింత విస్తృతమైన ప్రేక్షకాదరణను తీసుకొచ్చింది. యాంకరింగ్‌తో పాటు సినిమాల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటూ తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం టెలివిజన్ కార్యక్రమాలతో పాటు ఎంపిక చేసుకున్న సినిమాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. టెలివిజన్, సినిమా రంగాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న శ్రీముఖి, తాజా సంప్రదాయ ఫొటోషూట్‌తో మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించారు.



## బ్రేకప్‌పై తొలిసారి అనుపమ స్పందన



మలయాళ చిత్రసీమ నుంచి వచ్చి తెలుగు ప్రేక్షకుల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి అనుపమ పరమేశ్వరన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశంపై తాజాగా స్పందించారు. ఇటీవల ఎదుర్కొన్న ప్రేమ విఫలత గురించి ఓ ఇంటర్వ్యూలో ఆమె తొలిసారి తన అనుభవాలను పంచుకున్నారు. దాదాపు రెండేళ్ల పాటు కొనసాగిన ఆ బంధం తనపై భావోద్వేగపరంగా గణనీయమైన ప్రభావం చూపిందని ఆమె తెలిపారు.ఆ సమయంలో ఎదురైన కొన్ని పరిస్థితులు తన మానసిక ప్రశాంతతను దెబ్బతీశాయని అనుపమ పేర్కొన్నారు. ఆ బంధంలో తనపై నియంత్రణ చూపించే ధోరణి కూడా ఉండేదని చెప్పారు. దీంతో క్రమంగా తన ఆత్మవిశ్వాసంపై ప్రభావం పడిందని, వ్యక్తిగత జీవితానికే కాకుండా వృత్తిపరమైన ప్రయాణానికి కూడా ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. తాను ఎంతో ఇష్టపడే పనిపైనా ఏకాగ్రత పెట్టడం కొన్ని సందర్భాల్లో కష్టంగా అనిపించిందని అనుపమ వెల్లడించారు. ఒకవైపు వ్యక్తిగత జీవితంలో ఎదురవుతున్న సమస్యలు, మరోవైపు కెరీర్‌ను కొనసాగించాల్సిన పరిస్థితి తనకు మానసికంగా భారంగా మారిందని పేర్కొన్నారు. ఈ అనుభవం తన జీవితాన్ని, భవిష్యత్తు నిర్ణయాలను మరో కోణంలో ఆలోచించేలా చేసిందని తెలిపారు.ఆ బంధం కొనసాగుతున్న సమయంలోనే భవిష్యత్తులో పెళ్లి చేసుకుంటే పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారే అవకాశం ఉందని తాను ఆలోచించినట్లు అనుపమ చెప్పారు. తనకు ఎదురవుతున్న పరిస్థితులను లోతుగా అర్థం చేసుకున్న తర్వాత ఆ బంధం నుంచి బయటకు రావడమే తనకు సరైన మార్గమని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఆ నిర్ణయం సులభం కాకపోయినా, తన జీవితంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాల్లో అదొకటని ఆమె అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం గత అనుభవాలను వెనక్కి నెట్టి జీవితంలో కొత్త దశను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అనుపమ తెలిపారు. తనను తాను మరింత బలంగా తీర్చిదిద్దుకోవడం, మానసిక ప్రశాంతతను తిరిగి పొందడం, కెరీర్‌పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం ప్రస్తుతం తన ప్రధాన లక్ష్యాలని చెప్పారు.అయితే తనతో రిలేషన్‌షిప్‌లో ఉన్న వ్యక్తి ఎవరనే విషయాన్ని మాత్రం అనుపమ వెల్లడించలేదు. మాజీ ప్రియుడి పేరు గురించి ఎలాంటి వివరాలు చెప్పకుండా, తన అనుభవం తనకు నేర్పిన విషయాల గురించే మాట్లాడారు. ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. వ్యక్తిగత జీవితంలో ఎదురైన కఠిన పరిస్థితులను అధిగమించి ముందుకు సాగుతున్న అనుపమకు అభిమానులు మద్దతు తెలుపుతున్నారు. గతాన్ని పక్కన పెట్టి తన కెరీర్‌పై దృష్టి సారిస్తూ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఆమెకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు దక్కాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



## సంగీతంలో సుకృతి వేణికి అరుదైన ఘనత

దర్శకుడు సుకుమార్ కూతురు సుకృతి వేణి బండ్రెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. ఈసారి నటనతో కాకుండా సంగీతంలో సాధించిన అరుదైన విజయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అమెరికాలోని బోస్టన్‌లో ఉన్న బర్కిలీ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ నిర్వహించనున్న సమ్మర్ మ్యూజిక్ ప్రోగ్రామ్‌కు ఆమె ఎంపికయ్యారు.ఈ కార్యక్రమం కోసం మొత్తం 272 మంది ఆడిషన్‌కు హాజరుకాగా, కేవలం 14 మందిని మాత్రమే ఎంపిక చేశారు. వారిలో సుకృతి కూడా చోటు దక్కించుకున్నారు. అంతేకాదు, సింగర్స్ విభాగంలో పూర్తి స్కాలర్‌షిప్ అందుకున్న ఏకైక విద్యార్థినిగా ఆమె నిలిచారు. సంగీత విభాగంలో 'ఎన్‌సెంబుల్ ఎక్సెలెన్స్ అవార్డు'కు ఎంపిక కావడంతో పాటు ఈ స్కాలర్‌షిప్ దక్కడం ఆమె ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. సుకృతి ఇప్పటికే నటిగానూ తన సత్తా చాటారు. 'గాంధీ తాత చెట్టు' చిత్రంలో నటనకు 2024 సంవత్సరానికి జాతీయ ఉత్తమ బాలనటి అవార్డును అందుకున్నారు. చిన్న వయసులోనే నటనలో జాతీయ స్థాయి గుర్తింపు పొందిన ఆమె.. ఇప్పుడు సంగీతంలోనూ తన ప్రతిభను చాటుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.తండ్రి సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాలు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న విషయం తెలిసిందే. ఇటీవల ఆయన జాతీయ అవార్డును కూడా అందుకున్నారు. మరోవైపు సుకృతి మాత్రం నటనతో పాటు సంగీతంపైనా దృష్టి పెడుతూ తనకంటూ ప్రత్యేకమైన మార్గాన్ని ఏర్పరుచుకుంటున్నారు. భవిష్యత్తులో ఆమె నటనకు ప్రాధాన్యం ఇస్తారా.. సంగీతాన్ని కెరీర్‌గా ఎంచుకుంటారా అనేది ఆసక్తికరంగా మారింది.

## 'రామాయణం' కోసం భారీ ప్రమోషన్

భారతీయ సినీ చరిత్రలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'పై అంచనాలను మరింత పెంచేందుకు మేకర్స్ సరికొత్త ప్రచార వ్యూహాలను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 18న జరగనున్న బిగ్ సినీ ఎక్స్పో 2026లో సినిమాకు సంబంధించిన ప్రత్యేక ఫుటేజ్‌ను ప్రదర్శించనున్నారు.

అయితే ఈ ఫుటేజ్‌ను సాధారణ ప్రేక్షకుల కోసం కాకుండా థియేటర్ యజమానులు, సినీ పరిశ్రమ ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకు బయటకు రాని అత్యున్నత సాంకేతిక విలువలతో కూడిన విజువల్స్‌ను ఇందులో చూపించనున్నట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ అనుభూతి ఎలా ఉండబోతోందన్న దానిపై ట్రేడ్ వర్గాలకు ముందుగానే అవగాహన కల్పించడమే ఈ ప్రదర్శన ప్రధాన ద్దేశంగా తెలుస్తోంది.భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో విజువల్ ఎఫెక్ట్స్ హాలీవుడ్ స్థాయిలో ఉండనున్నాయని ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. బిగ్ సినీ ఎక్స్పోలో ప్రదర్శించబోయే ఫుటేజ్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతుందని చిత్ర బృందం భావిస్తోంది.ఇక విడుదల విషయంలోనూ మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే



ఈ మహాకావ్యం ఈ ఏడాది దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న భారీ ప్రమోషన్‌తో 'రామాయణం' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

## బ్యాక్‌బెంచర్ నుంచి స్టార్ హీరోగా

తమిళ స్టార్ హీరో విశాల్ తన విద్యాభ్యాసం, కాలేజీ రోజులు, సినీ రంగ ప్రవేశం గురించి ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తాను చదువులో టాపర్‌ను కాదని, సగటు విద్యార్థినేనని చెప్పారు. అంతేకాదు, కాలేజీలో బ్యాక్‌బెంచర్‌గా ఉండేవాడినని సరదాగా గుర్తు చేసుకున్నారు."మా బ్యాక్‌బెంచ్ బ్యాచ్‌లో ఒకరు మాజీ డిప్యూటీ సీఎం, మరొకరు మాజీ విద్యాశాఖ మంత్రి. నేను నటుడిగా మారాను. మా ముగ్గురం బ్యాక్‌బెంచర్లమే" అని విశాల్ నవ్వుతూ చెప్పారు. తాను బాయ్స్ స్కూల్‌లో చదువుకున్నానని, ప్రశ్నలకు సమాధానాలు తెలియనప్పుడు టీచర్లకు దొరకకుండా ఉండేందుకు బ్యాక్‌బెంచ్‌లో కూర్చునేవాడినని తెలిపారు.తాను చెడ్డ విద్యార్థిని కాదని, అలాగని అద్భుతమైన విద్యార్థిని కూడా కాదని విశాల్ అన్నారు. 12వ తరగతి చివరి రోజు వరకు ప్రశ్నపత్రం కోసం ప్రయత్నించానని, అది దొరకకపోవడంతో చివరికి చదివి పరీక్ష రాసి 75 శాతం మార్కులు సాధించినట్లు గుర్తుచేసుకున్నారు.చిన్నతనం నుంచే జీవితంలో ఎన్నో మార్గాలు ఉన్నాయని విశాల్ తెలిపారు. తన తండ్రి తనను అథ్లెట్‌గా చూడాలనుకున్నారని, అయితే ఓ సినిమా చూసిన తర్వాత దర్శకుడు కావాలనే ఆలోచన తనలో బలపడిందని చెప్పారు. తాను దర్శకుడిని కావాలనుకుంటున్నట్లు తల్లిదండ్రులకు చెప్పినప్పుడు వారు ఆశ్చర్యపోయారని గుర్తుచేసుకున్నారు. కాలేజీ రోజుల్లో ఎదురైన అనుభవాలు జీవితాన్ని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాయని విశాల్ అన్నారు. ఆ జ్ఞాపకాలను కోల్పోతే కాలేజీ జీవితంలో మిగిలేది ఏమీ ఉండదని పేర్కొన్నారు. తన తండ్రి నుంచి సానుకూలంగా ఆలోచించడం, ఎప్పుడూ పాజిటివ్‌గా ఉండటం నేర్చుకున్నానని, జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com